www.udyamakeratam.com

RNI: TGTEL/25/A0273

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షితః

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

1వ వార్షికోత్సవం

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 35 | 11-7-2026 | శనివారం | పేజీలు: 8 | వెల : రూ.2/- |



## కాంగ్రెస్ తెచ్చిన కరువే

- కావాలనే నీళ్లు వదిలేస్తున్న ప్రభుత్వం
- కక్షతో రైతులను ఆగం చేస్తున్నారు
- సీఎం రేవంత్‌పై కేటీఆర్ ఫైర్

2

## బుల్లెట్ రైళ్ల హబ్‌గా తెలంగాణ

- రాష్ట్రానికి మంజూరైన 3 బుల్లెట్ రైళ్లు
- వేగంగా రైల్వే ప్రాజెక్టుల నిర్మాణం
- కేంద్ర మంత్రి వైష్ణవ్ ప్రకటన

.. వివరాలు 3లో





## సీఎంపీ ప్యాడ్ హబ్!

- దేశంలోనే తొలి టెక్నాలజీ హబ్
- హైదరాబాద్ టీవర్క్స్‌లో అట్టహాసంగా ప్రారంభం
- జపాన్ కంపెనీతో సాంకేతిక ఒప్పందం
- సీఎంపీ ప్యాడ్ల తయారీకి శ్రీకారం
- మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

3

## 9వ తరగతి బాలికపై లైంగికదాడి

- ఆలస్యంగా వెలుగులోకి దారుణం!
- నిందితుడు సమీప బంధువేనని ఆరోపణలు..
- కరీంనగర్ ఆస్పత్రిలో విషమంగా పరిస్థితి

2





## విమాన సర్వీసులు పెంచండి

- ఏ380 విమానాలు ఇక్కడినుంచి నడపాలి
- వరంగల్ ఆదిలాబాద్‌ల్లో సేవలు విస్తరించాలి
- ఎంఆర్వో కార్యకలాపాలకు పూర్తి సహకారం
- క్రీడాకారులకు సైతం స్పాన్సర్ చేయాలి
- ఎమిరేట్స్ సంస్థకు సీఎం విజ్ఞప్తి

..వివరాలు 2లో



## కేంద్రం నుంచి అనుమతి తెస్తే ఎత్తిపోస్తాం

### ఎన్డీఎస్ఏ అభ్యంతరం లేకుంటే ఓకే

- లేదంటే ప్రాజెక్టుకు తీవ్ర ముప్పు
- తప్పులు చేసింది గత ప్రభుత్వమే
- ఇప్పుడు మాపై నెపాలు వేస్తున్నారు
- గేట్లు మూస్తే ముంపు తప్పదు
- ప్రజలను తప్పదోవ పట్టించేలా ఈటెల వ్యాఖ్యలు
- బిఆర్ఎస్ నేతల సూచనలతోనే మాట మార్చిన ఈటెల
- ఈటెల, బిఆర్ఎస్ నేతలకే నిర్వహణ బాధ్యత అప్పగిస్తా
- సీఎం రేవంత్ రెడ్డి

2


కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఉద్దేశపూర్వకంగా అబద్దాలు ప్రచారం చేస్తున్నారని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ప్రాజెక్టు నాశనమైందని ఆయన మండిపడ్డారు. కేంద్రంలో పలుకుబడి ఉన్న బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ జలశక్తి మంత్రితో మాట్లాడి ఎన్డీఎస్ఏ నుంచి అనుమతి తీసుకువస్తే.. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయడానికి తమ ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. గేట్లు మూయకుండా నీటిని ఎత్తిపోయడం సాధ్యం కాదని, అలాగని గేట్లు మూస్తే ప్రాజెక్టు కొట్టుకుపోతుందన్న ఎన్డీఎస్ఏ హెచ్చరికల మేరకే తాము నడుచుకుంటున్నామని సీఎం వివరించారు.ఆశనివారం సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ విపక్షాల తీరును తీవ్రంగా దుయ్యబట్టారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

- ఉద్యమ కెరటం, హైదరాబాద్

## షాబాద్‌లో ఆరు హత్యలు

### బెయిల్‌పై వచ్చి పోక్సో నిందితుడి ఘాతుకం





బాలిక సహా ఆరుగురి బలి

భార్య పిల్లలను చంపిన సైకో

పరారీలో హంతకుడు

- పోలీసుల వైఫల్యమే కారణమన్న స్థానికులు
- తీవ్ర ఉద్రిక్తతకు దారితీసిన ఘటన
- పరామర్శకు వెళ్లిన బీఆర్ఎస్ నేతలు
- ఎక్కడికక్కడ అరెస్ట్ చేసిన పోలీసులు
- 7 బృందాలతో గాలింపు చర్యలు

రంగారెడ్డి జిల్లా షాబాద్ పరిధిలో పోక్సో కేసు నిందితుడు కిరాతకంగా ఆరుగురిని దారుణంగా హత్య చేసి మారణహోమం సృష్టించాడు. జైలు నుంచి బెయిల్ మీద వచ్చిన సైకో కిల్లర్.. తనపై కేసు పెట్టిన మైనర్ బాలికతో పాటు ఆమె తల్లి, నాయనమ్మను కడతేర్చాడు. అనంతరం సొంత భార్య, ఇద్దరు కన్నపిల్లల గొంతులు కోసి అత్యంత కిరాతకంగా చంపేశాడు. ఒకే రాత్రి ఈ ఆరు హత్యల ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల నిర్లక్ష్యం వల్లే ఇంతటి ఘాతుకం జరిగిందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు 3లో..

## షాబాద్ ఎస్ఐ రమేష్ సస్పెన్షన్

హంతకుడిపై రివార్డు ప్రకటన!.. పది బృందాలతో ముమ్మర గాలింపు

పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన..ఎమ్మెల్యేను అడ్డుకున్న స్థానిక ప్రజలు

3

## నన్ను చంపాలనుకుంటే మటాష్



- వేయి క్షిపణులు ఇరాన్‌పై ఏకకాలంలో దాడి
- ఊహించని విధంగా ఇరాన్‌ను అంతం చేస్తాం
- సైన్యానికి ఆదేశాలు ఇచ్చి పెట్టాను
- సొంత సోషల్ మీడియా ట్రూత్‌లో ట్రంప్ హెచ్చరికలు

4

## ప్రధాని నరేంద్ర మోదీ నేరుగా ప్రజలతోనే కనెక్ట్ అవుతారు



- మధ్యలో ఇతరుల జోక్యం కోరుకోరు
- మీడియాను దూరంగా పెట్టడంపై జర్నలిస్ట్ ప్రశ్న
- విదేశాంగ అధికారి రుద్రేంద్ర టాండన్ జవాబు

2

## బంధం మరింత బలోపేతం

- ఈ ప్రయాణం ముందుందు మరింత విజయవంతమవుతుంది
- ప్రవాస భారతీయుల కృషి ఇందుకు ప్రధాన కారణం
- న్యూజిలాండ్ పర్యటనలో మోడీ



4

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
శనివారం
11 జూలై 2026

# కాంగ్రెస్ తెచ్చిన కరువే!

■ కావాలనే నీళ్లు వదిలేస్తున్న ప్రభుత్వం ■ కక్షతో రైతులను ఆగం చేస్తున్నారు

■ కన్నెపల్లి నుంచి నీళ్లు ఎత్తిపోయాలి ■ సీఎం రేవంత్‌పై కేటీఆర్ ఫైర్

**హైదరాబాద్, జూలై 11:** రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఆరుగురిని హత్య చేసిన దారుణ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో స్పందించారు. ఈ 6 హత్యలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని ఆయన ఆరోపించారు. పోక్సో కేసు నిందితుడికి బెయిల్ రాకుండా అడ్డుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఇలాంటి మానవ మృగాలను సమాజంలోకి వదిలితే ఇకపై ఆడపిల్లలు బయటకు వచ్చి ఫిర్యాదు చేసేందుకు భయపడతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి సీఎం రేవంత్ రెడ్డి కచ్చితంగా సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. షాబాద్‌లో జరిగిన దారుణ హత్యల ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పోక్సో లాంటి దారుణమైన కేసులో అరెస్టయిన వ్యక్తికి బెయిల్ రాకుండా చూడటంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. నిందితుడికి బెయిల్ వస్తే తమకు ప్రాణహాని ఉందని బాధిత కుటుంబం మొత్తుకున్నా ప్రభుత్వ న్యాయవాదులు కోర్టులో సరైన వాదనలు వినిపించలేదని ఆయన విమర్శించారు. హోంశాఖ వైఫల్యం, ప్రభుత్వ లాయర్ల నిర్లక్ష్యం వల్లే ఆ మానవ మృగం బయటకు వచ్చి ఆరుగురిని కిరాతకంగా చంపేశాడని కేటీఆర్ దుయ్యబట్టారు. ఒక ఆడపిల్ల తండ్రిగా తాను సీఎం రేవంత్ రెడ్డిని సూటిగా అడుగుతున్నానని కేటీఆర్ అన్నారు. ఇలాంటి దారుణాలకు పాల్పడే మానవ మృగాలను ఏ కారణం చేత సమాజంలోకి వదులుతున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ హత్యలకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు డబ్బులు, పలుకుబడికి అమ్ముడుపోయి నోరు మూసుకుని కూర్చుంటే ఇక రాష్ట్రంలో ఆడపిల్లలకు రక్షణ ఎక్కడుందని ఆయన నిలదీశారు. ఇలాంటి దారుణ ఘటనల తర్వాత రేపటి రోజున ఏ ఆడపిల్లకైనా అన్యాయం జరిగితే ధైర్యంగా బయటకు వచ్చి ఫిర్యాదు చేస్తుందా అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా పట్టింపు లేని ఈ ప్రభుత్వానికి కనీసం సిగ్గుండాలని కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

# కావాలనే పంపులు తెరవడం లేదు

మరోమారు ప్రభుత్వంపై హరీష్ రావు ఆరోపణలు

**సిద్దిపేట, జూలై 11:** ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నది కాలం తెచ్చిన కరువు కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కుటిల బుద్ధితో తెచ్చిన కరువు అని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. గోదావరి నదిలో కావలసినన్ని నీళ్లు ఉన్నప్పటికీ, కేసీఆర్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోనన్న ఈర్ష్యతో కన్నెపల్లి పంప్ హౌస్ మోటార్లను ప్రభుత్వం కావాలనే ఆన్ చేయడం లేదని విమర్శించారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం తిమ్మాయ్ పల్లి గ్రామంలో జరిగిన పెద్దమ్మ దేవాలయ ఉత్సవాల్లో హరీష్ రావు పాల్గొని మాట్లాడారు. సిద్దిపేట జిల్లా పెద్దమ్మ తల్లి రేవంత్ రెడ్డికి సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుకున్నట్లు వెల్లడించారు. ఎంతటి కరవు వచ్చినా రైతాంగానికి నీరందించేలా కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని, మోటార్లు ఆన్ చేస్తే రంగనాయక సాగర్ నిండి, సిద్దిపేట నియోజకవర్గంలోని దాదాపు 70 నుంచి 80 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని స్పష్టం చేశారు. కాళేశ్వరంతో ఒక్క ఎకరం కూడా పండలేదని వెల్లడించిన ముఖ్యమంత్రి తిమ్మాయిపల్లి గ్రామానికి వచ్చి ప్రజలతో మాట్లాడితే అర్థమవుతుందని అన్నారు. తిమ్మాయిపల్లిలో తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో ఎదురుచూసే పరిస్థితి ఉండేదని, కాళేశ్వరం జలాల రాకతో ఈ ప్రాంతం బంగారు పంటలతో కళకళలాడుతోందని సంతోషం వ్యక్తం చేశారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు నర్మెట ఫ్యాక్టరీ ద్వారా అద్భుతమైన ఆదాయం లభిస్తోందని తెలిపారు.

# మోడీ నేరుగా ప్రజలతోనే కనెక్ట్ అవుతారు

మధ్యలో ఇతరుల జోక్యం కోరుకోరు

మీడియాను దూరంగా పెట్టడంపై జర్నలిస్ట్ ప్రశ్న

విదేశాంగ అధికారి రుద్రేంద్ర టాండన్ జవాబు

**ఆక్లాండ్, జూలై 11:** ప్రస్తుతం మూడు దేశాల పర్యటనలో భాగంగా న్యూజిలాండ్‌లో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ పొలిటికల్ కమ్యూనికేషన్ స్టైల్‌పై అంతర్జాతీయ మీడియా నుంచి ఆసక్తికర ప్రశ్న ఎదురైంది. భారత రాయబార కార్యాలయ అధికారులతో జరిగిన ఓ ముఖాముఖి సమావేశంలో, ఓ స్థానిక జర్నలిస్ట్ నేరుగా దౌత్యవేత్తలను ఉద్దేశించి 'ప్రధాని మోదీ మీడియా సమావేశాలు ఎందుకు నిర్వహించరని ప్రశ్నించారు. దీనికి భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి, ప్రముఖ దౌత్యవేత్త రుద్రేంద్ర టాండన్ అత్యంత చాకచక్యంగా స్పష్టమైన సమాధానమిచ్చారు.



జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు విదేశాంగ అధికారి రుద్రేంద్ర టాండన్ స్పందిస్తూ.. ప్రధాని రాజకీయ వ్యూహాలను ఒక ప్రభుత్వ అధికారిగా తాను ప్రశ్నించలేనని చెప్తూనే, భారతీయ రాజకీయాల నేపథ్యాన్ని వివరించారు. 'ప్రధాని మోదీ పక్కా భారతీయ రాజకీయవేత్త. సాధారణంగా భారతీయ నాయకులు తమ ఓటర్లతో నేరుగా సంబంధాలు కలిగి ఉండటానికే ఇష్టపడతారు. మధ్యవర్తులు లేదా మీడియా ద్వారా ప్రజలతో మాట్లాడటం కంటే, నేరుగా ప్రజలకే తమ సందేశాన్ని చేరవేయాలని భావిస్తారు' అని టాండన్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఈ 'డైరెక్ట్ కాంటాక్ట్' విధానంలో అద్భుతమైన నైపుణ్యం సాధించారని, అందువల్లే ఆయన భారతదేశంలో అత్యధిక కాలం పనిచేసిన ప్రధానులలో ఒకరిగా నిలిచారని గుర్తుచేశారు. ప్రజలు ఆయన విధానాన్ని ఆదరించబట్టే వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చారని దౌత్యవేత్త స్పష్టం చేశారు. ప్రధాని మోదీ విదేశీ పర్యటనల్లో ఇలాంటి ప్రశ్నలు రావడం ఇదేం మొదటిసారి కాదు. గత మేలో నార్వే రాజధాని ఓస్లో పర్యటన సందర్భంగా కూడా అక్కడి ప్రధాని జోనాస్ గహర్ స్టోర్‌తో కలిసి మోదీ సంయుక్తంగా మీడియా ముందుకు వచ్చినప్పుడు.. హెల్ లింగ్ అనే నార్వేజియన్ జర్నలిస్ట్ ప్రధాని మోదీని ఉద్దేశించి 'మీరు జర్నలిస్టుల ప్రశ్నలకు ఎందుకు సమాధానం ఇవ్వరు?' అని బహిరంగంగా అడిగారు. అప్పట్లో ఈ అంశం సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది.

# కేంద్రం నుంచి అనుమతి తెస్తే ఎత్తిపోస్తాం!

- ఎన్డీఎస్ఏ అభ్యంతరం లేకుంటే ఓకే
- లేదంటే ప్రాజెక్టుకు తీవ్ర ముప్పు
- తప్పులు చేసింది గత ప్రభుత్వమే
- ఇప్పుడు మాపై నెపాలు వేస్తున్నారు
- గేట్లు మూస్తే ముంపు తప్పదు
- ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఈటెల వ్యాఖ్యలు
- బిఆర్ఎస్ నేతల సూచనలతోనే మాట మార్చిన ఈటెల
- ఈటెల, బిఆర్ఎస్ నేతలకే నిర్వహణ బాధ్యత అప్పగిస్తా
- సీఎం రేవంత్ రెడ్డి



**ఉద్యమ కెరటం, హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఉద్దేశపూర్వకంగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ప్రాజెక్టు నాశనమైందని ఆయన మండిపడ్డారు. కేంద్రంలో పలుకుబడి ఉన్న బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ జలశక్తి మంత్రితో మాట్లాడి ఎన్డీఎస్ఏ నుంచి అనుమతి తీసుకువస్తే.. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయడానికి తమ ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. గేట్లు మూయకుండా నీటిని ఎత్తిపోయడం సాధ్యం కాదని, అలాగని గేట్లు మూస్తే ప్రాజెక్టు కొట్టుకుపోతుందన్న ఎన్డీఎస్ఏ హెచ్చరికల మేరకే తాము నడుచుకుంటున్నామని సీఎం వివరించారు. శనివారం సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ విపక్షాల తీరును తీవ్రంగా దుయ్యబట్టారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ సైతం ఈ సమావేశంలో పాల్గొన్నారు. విపక్షాలు ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టాలని కుట్రలు చేస్తున్నాయని సీఎం ఆరోపించారు. మాజీ మంత్రి హరీశ్ రావు సూచనల మేరకే బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈటల రాజేందర్ అంటే తమకు ఎంతో గౌరవం ఉందని, కానీ ఇలాంటి వ్యాఖ్యలతో ఆయన తన గౌరవాన్ని పోగొట్టుకుంటున్నారని సీఎం హితవు పలికారు. ప్రజలకు వాస్తవాలు తెలిపేందుకే తాము ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదిక, ఆదేశాల మేరకే తాము నడుచుకుంటున్నామని ప్రభుత్వం స్పష్టం చేసింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తరఫున ఎంపీగా గెలిచిన ఈటల రాజేందర్ జలశక్తి మంత్రిత్వ శాఖను కలిసి నీటిని ఎత్తిపోసేందుకు అనుమతి తీసుకురావాలని సీఎం సవాల్ చేశారు. వారు అనుమతి తెస్తే తాము పంపులు ఆన్ చేస్తామని, దీని నిర్వహణ బాధ్యత కూడా ఈటల, బీఆర్ఎస్ నేతలకే అప్పగిస్తామని చెప్పారు. ఎన్డీఎస్ఏ ఆదేశాల మేరకే మేడిగడ్డ గేట్లు ఎత్తి ఉంచామని సీఎం గుర్తుచేశారు. మేడిగడ్డ గేట్లు మూస్తేనే కన్నెపల్లి వద్ద పంపులు నడపడానికి వీలుంటుందని, అలా కాకుండా పారుతున్న నీటిని ఎత్తిపోయడం అసాధ్యమని తేల్చిచెప్పారు. ఒకవేళ గేట్లు మూస్తే భద్రాచలం వరకు ముంపు తప్పదని ఎన్డీఎస్ఏ స్పష్టంగా తెలిపిందని సీఎం వెల్లడించారు. పట్టిసీమ కోసం నీటిని వదులుతున్నామన్న ఆరోపణలపై సీఎం మండిపడ్డారు. పోలవరం పూర్తయ్యే వరకు పట్టిసీమను కట్టుకున్న విషయం ఆనాటి మంత్రి హరీశ్ రావుకు తెలియదా అని ప్రశ్నించారు. కావాలనే బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో 2019 జూన్ 21న కాళేశ్వరం ప్రారంభించగా.. ఆ ప్రాజెక్టు ప్రారంభించిన 11 నెలల్లోనే లోపాలు బయటపడ్డాయని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో లోపాలు ఉన్నాయని 2020 మే 18న ఈఈ రమణారెడ్డి అప్పటి కేసీఆర్ ప్రభుత్వానికి లేఖ రాశారని గుర్తుచేశారు. ఆ లోపాలు సరిదిద్దాలని అప్పట్లోనే ఇంజనీర్లు సూచించినా పట్టించుకోలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే లోపాలు పెరిగి పెద్దవై బ్యారేజీ కుప్పకూలిందని ఆరోపించారు. 2022 జూలై 14న వచ్చిన వరదలకు కన్నెపల్లి పంప్ హౌస్ దెబ్బతిందని, ఇప్పటికీ అది వినియోగంలోకి రాలేదని తెలిపారు. 2023 అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందని గుర్తుచేశారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే ఎన్డీఎస్ఏ కమిటీని ఏర్పాటు చేసిందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు నీటి నిల్వకు ఏమాత్రం అనుకూలం కాదని ఎన్డీఎస్ఏ కమిటీ తేల్చిచెప్పిందని వెల్లడించారు. ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణం, నిర్వహణ లోపాలపై గతంలోనే ఎన్డీఎస్ఏ కమిటీ నివేదిక ఇచ్చిందని పేర్కొన్నారు. ప్రాథమిక, తుది నివేదికల్లో కూడా ఎన్డీఎస్ఏ ఇదే విషయాన్ని స్పష్టం చేసిందని తెలిపారు. లోపాలు సరిదిద్దాలని నిపుణులు చెప్పినా ఎందుకు పట్టించుకోలేదని ఆయన బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. మొదట్లోనే స్పందించకపోవడం వల్లే ఈ సమస్య ఇంత పెద్దది అయిందని వివరించారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకే బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, హరీశ్ రావు పదేపదే అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# విమాన సర్వీసులు పెంచండి

**హైదరాబాద్, జూలై 11:** హైదరాబాద్ నుంచి విమాన సర్వీసులను మరింత పెంచడంతో పాటు ప్రతిష్టాత్మక ఏ380 సర్వీసులను ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమిరేట్స్ సంస్థను కోరారు. ఎమిరేట్స్ వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సర్హాన్ శనివారం సచివాలయంలో సీఎంతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎంఆర్వో కేంద్రాల ఏర్పాటు, భవిష్యత్తులో వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల్లో సేవల విస్తరణపై కీలక చర్చలు జరిపారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్సిటీలో క్రీడాకారులకు స్పాన్సర్‌షిప్ అందించాలన్న సీఎం కోరికపై ఎమిరేట్స్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. ఎమిరేట్స్ సంస్థ భారత్‌లో 25 ఏళ్ల సేవలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు సీఎంను కలిశారు. హైదరాబాద్ నుంచి ఏ380 విమాన సర్వీసులను ప్రారంభించేందుకు ఎమిరేట్స్ సంస్థ సుముఖత వ్యక్తం చేసింది. నగరంలో విమాన సర్వీసులను మరింత పెంచాలని సీఎం రేవంత్ రెడ్డి వారిని కోరారు. విమాన సర్వీసులకు కావాల్సిన అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి వారికి స్పష్టం చేశారు. రాష్ట్రంలో త్వరలో వరంగల్, ఆదిలాబాద్ ప్రాంతాల్లో కొత్తగా మరో 2 విమానాశ్రయాలు ఏర్పాటు కాబోతున్నాయని సీఎం వారికి వివరించారు. ఈ నేపథ్యంలో అక్కడ కూడా ఎమిరేట్స్ తన కార్యకలాపాలను ప్రారంభించి కొనసాగించాలని సూచించారు. రాష్ట్రంలో ఎంఆర్వో (మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్) కార్యకలాపాలను స్థాపించి విస్తరించాలని, ఇందుకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు. కేవలం విమానయాన రంగానికే పరిమితం కాకుండా క్రీడా రంగంలోనూ రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి ఎమిరేట్స్ ప్రతినిధులను ఆహ్వానించారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్సిటీలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు ఆర్థిక అండగా నిలుస్తూ స్పాన్సర్‌షిప్ అందించేందుకు ముందుకు రావాలని కోరారు. సీఎం చేసిన ఈ ప్రతిపాదనలపై ఎమిరేట్స్ వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సర్హాన్ అత్యంత సానుకూలంగా స్పందించారు. ఏ380 విమానాలతో పాటు క్రీడాకారుల శిక్షణకు స్పాన్సర్‌షిప్ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# 9వ తరగతి బాలికపై లైంగికదాడి

- ఆలస్యంగా వెలుగులోకి దారుణం!
- నిందితుడు సమీప బంధువేనని ఆరోపణలు..
- కరీంనగర్ ఆస్పత్రిలో విషమంగా పరిస్థితి
- కుటుంబ పరువు పేరుతో కప్పిపుచ్చేందుకు మధ్యవర్తుల యత్నం?
- సమాచారం అందినా పట్టించుకోని పోలీసులు..
- కాగజ్‌నగర్‌లో కలకలం



**ఉద్యమ కెరటం, హైదరాబాద్:** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో ఒక తొమ్మిదో తరగతి బాలికపై లైంగికదాడికి పాల్పడిన అమానుష ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృగాడి చేతిలో తీవ్ర రక్తస్రావానికి గురైన సదరు బాలిక ప్రస్తుతం కరీంనగర్ ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటనను కొందరు పెద్దలు కప్పిపుచ్చేందుకు యత్నిస్తుండటం, పోలీసుల మధ్య సమాచార లోపం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## స్కూల్లో ఫిట్స్ వచ్చాయని..

ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఈ నెల 9వ తేదీన బాలిక ఎప్పటిలాగే పాఠశాలకు వెళ్లింది. అయితే స్కూల్లో ఉండగానే సదరు బాలికకు తీవ్రంగా ఫిట్స్ (మూర్ఛ) వచ్చినట్లు ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఆందోళనతో పాఠశాలకు చేరుకున్న కుటుంబ సభ్యులు వెంటనే బాలికను కాగజ్‌నగర్ పట్టణంలోని ఒక ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడ బాలిక మతిస్థిమితం కోల్పోయినట్లు అపస్మారక స్థితిలో మాట్లాడటంతో, స్థానిక వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ఆసుపత్రికి తీసుకెళ్లారు.

## లైంగికదాడి నిర్ధారణ.. కరీంనగర్‌కు రిఫర్

మంచిర్యాల దవాఖానలో వైద్యులు బాలికను నిశితంగా పరిశీలిస్తున్న సమయంలో ఆమె భయంతో ప్రవర్తించిన తీరుపై అనుమానం వచ్చింది. దీంతో వైద్యులు తక్షణమే ఫిజికల్ టెస్టులు నిర్వహించగా.. బాలిక ఒంటిపై తీవ్రమైన గాయాలు ఉండటంతో పాటు విపరీతంగా రక్తస్రావం కావడం గమనించారు. సదరు బాలికపై అత్యంత క్రూరంగా లైంగికదాడి జరిగినట్లు నిర్ధారించిన వైద్యులు, ఈ విషయాన్ని వెంటనే పోలీసులకు తెలియజేశారు. అనంతరం మెరుగైన అత్యవసర చికిత్స కోసం బాలికను కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి రిఫర్ చేశారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న బాలిక పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని సమాచారం.

## పరువు పేరుతో కప్పిపుచ్చే యత్నం!

ఈ దారుణానికి ఒడిగట్టిన నిందితుడు బాలికకు అత్యంత సమీప బంధువేనని తెలుస్తోంది. అయితే అతడు గత కొంతకాలంగా నిత్యం ఇలాగే వేధిస్తున్నాడా, లేక ఆ రోజే ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడా అనేది తేలాల్సి ఉంది. మరోవైపు, ఈ ఘటనను గోప్యంగా ఉంచేందుకు కొందరు పెద్దలు మధ్యవర్తిత్వం వహిస్తున్నట్లు సమాచారం. ఈ విషయం బయటకు వస్తే కుటుంబంతో పాటు ఊరి పరువు పోతుందని, దీనిని ఇక్కడితోనే వదిలేయాలని బాధితుల కుటుంబానికి హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. ఎవరైనా ఈ విషయంపై ఆరా తీస్తే.. అలాంటిదేమీ జరగలేదని, కావాలనే పుకార్లు సృష్టిస్తున్నారని మభ్యపెడుతున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది.

## పోలీసుల తీరుపై అనుమానాలు..

ఈ అమానుష ఘటనలో పోలీసుల వ్యవహారశైలిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాలికపై లైంగికదాడి జరిగినట్లు నిర్ధారించిన వెంటనే మంచిర్యాల వైద్యులు ముందుగా స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే మంచిర్యాల పోలీస్ స్టేషన్ నుంచి కాగజ్‌నగర్ పోలీసులకు సమాచారం చేరిందా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ అధికారికంగా సమాచారం అందినా కూడా కాగజ్‌నగర్ పోలీసులు ఉద్దేశపూర్వకంగానే చర్యలు తీసుకోలేదా? నిందితుడిని కాపాడేందుకు ఎవరైనా ఒత్తిడి తెస్తున్నారా? అనే కోణంలో స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరపాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# షాబాద్‌లో ఆరు హత్యలు

- పోక్సో నిందితుడి ఘాతుకం
- బెయిల్‌పై వచ్చి కక్ష సాధింపు
- బాలిక సహా ఆరుగురి బలి
- భార్య పిల్లలను చంపిన సైకో

పోలీసుల వైఫల్యమే కారణమన్న స్థానికులు





**షాబాద్, జూలై 11:** రంగారెడ్డి జిల్లా షాబాద్ పరిధిలో పోక్సో కేసు నిందితుడు కిరాతకంగా ఆరుగురిని దారుణంగా హత్య చేసి మారణహోమం సృష్టించాడు. జైలు నుంచి బెయిల్ మీద వచ్చిన సైకో కిల్లర్.. తనపై కేసు పెట్టిన మైనర్ బాలికతో పాటు ఆమె తల్లి, నాయనమ్మను కడతేర్చాడు. అనంతరం సొంత భార్య, ఇద్దరు కన్నపిల్లల గొంతులు కోసి అత్యంత కిరాతకంగా చంపేశాడు. ఒకే రాత్రి ఈ ఆరు హత్యల ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల నిర్లక్ష్యం వల్లే ఇంతటి ఘాతుకం జరిగిందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. షాబాద్ మండలం దైవాలగూడకు చెందిన రాజ్ కుమార్ (28) అదే గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికను (17) వేధిస్తున్నాడు. ఈ క్రమంలో బాలిక తల్లి లక్ష్మి ఫిర్యాదుతో మే 16వ తేదీన రాజ్ కుమార్‌పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. మే 26న అతడిని అరెస్ట్ చేసి జైలుకు పంపారు. 20000 రూపాయల పూచీకత్తుతో శుక్రవారం అతడు బెయిల్‌పై బయటకు వచ్చాడు. కక్ష పెంచుకున్న అతడు.. రాత్రి 11 గంటల సమయంలో మైనర్ బాలిక ఇంట్లోకి చొరబడి ఆమెను బలవంతంగా కారులో లాక్కెళ్లేందుకు యత్నించాడు. దీనికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు రికార్డయ్యాయి. అడ్డువచ్చిన బాలిక తల్లి లక్ష్మి, నాయనమ్మ రుక్కమ్మను కత్తితో పొడిచి చంపాడు. ఆ తర్వాత బాలికను హిమాయత్ సాగర్ చెరువు సమీపంలోకి తీసుకెళ్లి పీక కోసి హత్య చేశాడు.

## సొంత వాళ్లను వదల్లేదు..

ముగ్గురిని చంపిన తర్వాత శనివారం తెల్లవారుజామున 1 గంట ప్రాంతంలో రాజ్ కుమార్ తన ఇంటికి చేరుకున్నాడు. నిద్రపోతున్న భార్య సరిత (33), ఇద్దరు కుమారులు పరీక్షిత్ (4), దైవిక్షిత్ (2) గొంతులు కోసి దారుణంగా చంపాడు. 2018లో సరితను ప్రేమించి పెళ్లి చేసుకున్న నిందితుడు చివరకు సొంత కుటుంబాన్నే బలితీసుకున్నాడు. ఆ తర్వాత తన తండ్రి అరుణ్ కుమార్‌కు ఫోన్ చేసి ఆరుగురిని చంపానని, తాను కూడా చనిపోతున్నట్లు చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. తండ్రి సమాచారంతో సైబరాబాద్ సీపీ తరుణ్ జోషి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం 7 ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.

## పోలీసుల నిర్లక్ష్యమే కారణం..

పోలీసులు పోక్సో కేసులో బలహీనమైన సెక్షన్లు నమోదు చేయడం వల్లే 2 నెలల్లోనే నిందితుడికి బెయిల్ వచ్చిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో భూతగాదా విషయంలోనూ రాజ్ కుమార్‌పై 2 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, పోలీసులు ముందే కఠిన చర్యలు తీసుకుని ఉంటే ఈ ఘోరం జరిగేది కాదని వారు మండిపడ్డారు. నిందితుడిని తమకు అప్పగించాలంటూ షాబాద్ రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. మరోవైపు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు దైవాలగూడ వెళ్తున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, పట్నం నరేందర్ రెడ్డి, కార్తీక్ రెడ్డిలను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకుని అరెస్ట్ చేశారు. పోలీసుల తీరుపై విపక్ష నేతలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

# షాబాద్ ఎస్ఐ రమేష్ సస్పెన్షన్

**హంతకుడిపై రివార్డు ప్రకటన!.. పది బృందాలతో ముమ్మర గాలింపు**

**పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన.. ఎమ్మెల్యేను అడ్డుకున్న స్థానిక ప్రజలు**

**షాబాద్, జూలై 11::** రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో 6 గురిని బలితీసుకున్న కిరాతకుడు రాజ్‌కుమార్ వ్యవహారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసుల నిర్లక్ష్యంతోనే ఈ ఘోరం జరిగిందంటూ స్థానికులు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే కాలె యాదయ్యను అడ్డుకున్నారు. దీంతో రంగంలోకి దిగిన కలెక్టర్ సి. నారాయణరెడ్డి.. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన షాబాద్ ఎస్ఐ రమేష్‌ను సస్పెండ్ చేశారు. మరోవైపు పరారీలో ఉన్న సైకో కిల్లర్ ఆచూకీ చెబితే 2 లక్షల రివార్డు ఇస్తామని పోలీసులు ప్రకటించారు. ఆరు హత్యల ఘటన షాబాద్‌లో తీవ్ర ప్రకంపనలు సృష్టించింది. నిందితుడిని కఠినంగా శిక్షించాలని, తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ బాధిత బంధువులు షాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. షాద్‌నగర్ కంది రహదారిపై రాస్తారోకో చేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే కాలె యాదయ్యను స్థానికులు అడ్డుకుని తీవ్ర వాగ్వివాదానికి దిగారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అక్కడికి చేరుకుని ప్రజలను సముదాయించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్ఐ రమేష్‌ను సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సైతం బాధిత కుటుంబాలను కలిసి పరామర్శించారు.

## భార్యాపిల్లల హత్యపై అనుమానం

ఈ మారణకాండకు సంబంధించి ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి కీలక విషయాలు వెల్లడించారు. రాత్రి 11 గంటల సమయంలో మైనర్ బాలిక (17) ఇంట్లోకి చొరబడిన రాజ్‌కుమార్.. అడ్డువచ్చిన బాలిక తల్లి లక్ష్మి, నాయనమ్మ రుక్కమ్మను కత్తితో పొడిచి చంపాడు. ఆ తర్వాత బాలికను అఖిల్ సాగర్ చెరువు సమీపంలోకి తీసుకెళ్లి గొంతు కోసి చంపేశాడు. తెల్లవారుజామున తన ఇంటికి వెళ్లి నిద్రపోతున్న భార్య సరిత (33), ఇద్దరు కుమారులు పరీక్షిత్ (4), దైవిక్షిత్ (2)ల పీకలు కోసి కిరాతకంగా అంతమొందించాడు. ఆ తర్వాత తన తండ్రికి ఫోన్ చేసి తాను కూడా ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. అయితే సొంత భార్యాపిల్లలను వాడు ఎందుకు చంపాడన్నదే ఇప్పుడు పెద్ద మిస్టరీగా మారిందని సీపీ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

## ఆచూకీకి రెండు లక్షలు

పరారీలో ఉన్న సైకో కిల్లర్ రాజ్‌కుమార్ ఆచూకీ చెప్పిన వారికి 2 లక్షల నగదు రివార్డు అందిస్తామని పోలీసులు ప్రకటించారు. అతడిని పట్టుకునేందుకు 10 ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ దృశ్యాలు, టవర్ లొకేషన్ వివరాల ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ కేసులో ఎంతటి వారు నిర్లక్ష్యం వహించినా వదిలేది లేదని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

# సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందచేత

**జగిత్యాల, జులై11:** జగిత్యాల నియోజకవర్గంలోని పలువురు లబ్దిదారులకు మంజూరైన చెక్కులను ఎమ్మెల్సీ ఎల్ రమణ శనివారం అందజేశారు. వివిధ కారణాలతో ఆస్పత్రిలో చికిత్స పొంది వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి కోసం జగిత్యాల నియోజకవర్గంలోని తొమ్మిది మంది దరఖాస్తు చేసుకున్నారు. వారికి మంజూరైన లక్షా యాభైవేల రూపాయల చెక్కులను ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ లబ్దిదారులకు ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో జగిత్యాల పట్టణ కౌన్సిలర్లు కోరుకంటి రాము, తోట హరీశ్, మాజీ జడ్పీటీసీ కొలుముల రమణ, రాయికల్ మండలం ప్రధాన కార్యదర్శి కొండపల్కల రత్నాకర్ రావు, వొల్లాల గంగాధర్, గంగిపెల్లి వేణుమాధవ్, పెండెం గంగాధర్, చిరంజీవి, నందు నాయక్ పాల్గొన్నారు.

# బుల్లెట్ రైళ్ల హబ్‌గా తెలంగాణ

- రాష్ట్రానికి మంజూరైన 3 బుల్లెట్ రైళ్లు
- గంటల్లోనే ముంబై-చెన్నై ప్రయాణం
- వేగంగా రైల్వే ప్రాజెక్టుల నిర్మాణం
- దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్ల అభివృద్ధి
- అపారంగా సెమీ కండక్టర్ల అవకాశాలు
- కేంద్ర మంత్రి వైష్ణవ్ ప్రకటన



**హైదరాబాద్, జూలై 11:** హైదరాబాద్ నగరంలోని హెచ్ఐసీసీలో నిర్వహించిన వికసిత్ భారత్ 2047 సదస్సులో కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం బుల్లెట్ రైళ్లకు హబ్‌గా మారబోతోందని, దేశవ్యాప్తంగా మంజూరు చేసిన 7 బుల్లెట్ రైళ్లలో 3 తెలంగాణకే దక్కాయని ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా సెమీ కండక్టర్ల రంగంలో ఉన్న అపార అవకాశాలను మన యువత అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం ఆయన హెచ్ఐసీసీలో పానీపూరి తిని యూపీఐ ద్వారా ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించారు. ప్రపంచవ్యాప్తంగా సెమీ కండక్టర్ పరిశ్రమలో దాదాపు 10 లక్షల మంది నైపుణ్యం కలిగిన ఉద్యోగుల కొరత ఉందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ అవకాశాన్ని భారత్ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. దేశానికి ఎలక్ట్రానిక్స్, ఐటీ, చిప్ డిజైన్ రంగాల్లో ఇప్పటికే బలమైన పునాది ఉందన్నారు. విద్యార్థులకు సెమీ కండక్టర్ డిజైన్‌లో ప్రోత్సాహం అందించేందుకు సినాప్సిస్, క్యాడెన్స్ వంటి అత్యాధునిక టూల్స్‌ను 315 విశ్వవిద్యాలయాలకు ఉచితంగా అందించినట్లు వెల్లడించారు.

## యువతకు అపార అవకాశాలు

దేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం రెండంకెల వృద్ధిరేటుతో దూసుకుపోతోందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రస్తుతం ఈ పరిశ్రమ విలువ 13 లక్షల కోట్లకు చేరుకుందని, త్వరలోనే 20 లక్షల కోట్లకు పెరుగుతుందని చెప్పారు. ఈ రంగం ద్వారా ఇప్పటికే 25 లక్షల మందికి ఉపాధి లభిస్తోందని వెల్లడించారు. భారత్ నుంచి అత్యధికంగా ఎగుమతి అయ్యే వస్తువుల్లో మొబైల్ ఫోన్లు అగ్రస్థానంలో నిలిచాయన్నారు. తెలంగాణలో ప్రస్తుతం 104 ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థలు పనిచేస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం 4 భారీ ఎలక్ట్రానిక్ క్లస్టర్లను మంజూరు చేసిందని చెప్పారు. హైదరాబాద్‌లో హార్డ్‌వేర్ ప్రోటోటైప్ డిజైన్, టెస్టింగ్, వ్యాలిడేషన్ కోసం కామన్ ఫెసిలిటీ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

## బుల్లెట్ రైళ్ల హబ్

తెలంగాణకు రైల్వే బడ్జెట్‌ను కేంద్రం భారీగా పెంచిందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. తెలంగాణ బుల్లెట్ రైళ్లకు హబ్‌గా మారబోతోందన్నారు. దేశంలో 7 బుల్లెట్ రైళ్లను ప్రకటిస్తే.. అందులో తెలంగాణకు 3 దక్కాయని తెలిపారు. ఇవి అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం 1 గంట 10 నిమిషాలు, హైదరాబాద్ నుంచి ముంబైకి 2 గంటల 20 నిమిషాలు, చెన్నైకి 2 గంటల్లో వెళ్లవచ్చని చెప్పారు. దేశంలో తొలి బుల్లెట్ రైలు ప్రాజెక్టు ముంబై-అహ్మదాబాద్ మధ్య వేగంగా నిర్మాణం జరుగుతోందని, 2027లో తొలి దశ సేవలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు.

## రైల్వే బడ్జెట్ పెంపు

గత యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి రాష్ట్రానికి ఇచ్చిన రైల్వే బడ్జెట్ కేవలం 880 కోట్లు మాత్రమేనని, మోదీ సర్కార్ కేవలం తెలంగాణకే 5000 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా 1300 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులు చేపట్టామని వివరించారు. ఇప్పటికే 260 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పూర్తయ్యిందన్నారు. ఇందులో భాగంగా తెలంగాణలో 40 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణకు నిధులు ఇచ్చామన్నారు. గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా 36000 కిలోమీటర్ల కొత్త రైల్వే ట్రాక్‌లు నిర్మించామని, దేశంలోని రైల్వే నెట్‌వర్క్‌లో 99.4 శాతం విద్యుద్దీకరణ పూర్తయ్యిందని చెప్పారు. తెలంగాణకు ఇప్పటికే 5 వందేభారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయని, త్వరలో మరిన్ని ప్రారంభమవుతాయని చెప్పారు.

## యూపీఐతో పానీపూరి బిల్లు

హెచ్ఐసీసీలో సదస్సు ముగిసిన అనంతరం కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అక్కడున్న చాట్ బండార్ వద్ద పానీ పూరి రుచి చూశారు. కిషన్ రెడ్డితో కలిసి ఆయన ఈ చిరుతిండిని ఆస్వాదించారు. అనంతరం తన ఫోన్ నుంచి యూపీఐ యాప్ ద్వారా 175 రూపాయల బిల్లును డిజిటల్ రూపంలో చెల్లించారు.

# వికసిత్ భారత్‌కు మహిళా సాధికారతే పునాది!

**యువత భాగస్వామ్యమే మూల స్తంభాలు**

**దేశ నిర్మాణంలో పాలు పంచుకోవాలి**

**యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని గవర్నర్ పిలుపు**



**హైదరాబాద్, జూలై 11:** వికసిత్ భారత్‌కు మహిళా సాధికారత, యువత భాగస్వామ్యమే కీలకమైన మూలస్తంభాలని తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా స్పష్టం చేశారు. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం నారీ శక్తి వందన్ అధినియం ద్వారా కట్టుబడి ఉందని ఆయన గుర్తుచేశారు. లోక్ భవన్‌లో వీవీవీపీ, వీబీవైపీ విజేతలతో సమావేశమైన ఆయన మై భారత్ పోర్టల్ ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా శనివారం లోక్ భవన్‌లో వికసిత్ వైబ్రంట్ విలేజెస్ ప్రోగ్రామ్ (వీవీవీపీ), వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ (వీబీవైపీ) విజేతలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని ఉద్ఘాటించారు. యువత కేవలం ఉద్యోగాల కోసమే కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. భారతీయ సనాతన విలువలను కాపాడుతూ దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వస్తేనే వికసిత్ భారత్ సాకారం అవుతుందని గవర్నర్ స్పష్టం చేశారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. చట్టసభల్లో వారి గొంతుకను వినిపించేందుకు నారీ శక్తి వందన్ అధినియం తీసుకొచ్చినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా యువత వివరాల నమోదు కోసం రూపొందించిన మై భారత్ పోర్టల్ ప్రచార పోస్టర్లను గవర్నర్ తన చేతులమీదుగా ఆవిష్కరించారు.

# సీఎంపీ ప్యాడ్ హబ్!

- దేశంలోనే తొలి టెక్నాలజీ హబ్
- హైదరాబాద్ టీవర్క్స్‌లో అట్టహాసంగా ప్రారంభం
- జపాన్ కంపెనీతో సాంకేతిక ఒప్పందం
- సీఎంపీ ప్యాడ్ల తయారీకి శ్రీకారం
- మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి




**హైదరాబాద్, జూలై 11:** తెలంగాణ రాష్ట్రం సెమీ కండక్టర్ల రంగంలో మరో కీలక ముందడుగు వేసింది. దేశంలోనే తొలి సీఎంపీ (కెమికల్ మెకానికల్ పాలిషింగ్) ప్యాడ్ టెక్నాలజీ హబ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. టీవర్క్స్‌లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు శనివారం ప్రారంభించారు. జపాన్‌కు చెందిన తోరే కోకి సంస్థ సాంకేతిక సహకారంతో దీనిని ఏర్పాటు చేశారు. రాబోయే 18 నుంచి 24 నెలల్లో ఇక్కడే దేశీయంగా ప్యాడ్ల తయారీ ప్రారంభించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని దేశంలోనే ప్రముఖ సెమీ కండక్టర్ల హబ్‌గా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. జపాన్ దేశంతో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తూ అత్యాధునిక టెక్నాలజీ అభివృద్ధికి ఈ హబ్ అద్భుత వేదికగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చిప్ తయారీ ప్రక్రియలో అత్యంత కీలకమైన సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీ ఇకపై హైదరాబాద్‌లోనే అందుబాటులోకి రావడం గొప్ప విషయమన్నారు. దీనివల్ల దేశీయ సెమీ కండక్టర్ల పరిశ్రమకు భారీ ఊతం లభించనుందని మంత్రి చెప్పారు.

## విద్యార్థులకు స్టార్టప్‌లకు అండగా..

కొత్తగా ప్రారంభించిన ఈ టెక్నాలజీ హబ్ ద్వారా విద్యార్థులు, స్టార్టప్‌లు, పరిశోధకులకు ఎంతో మేలు జరగనుంది. వారికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణతో పాటు పరిశోధన, ఉత్పత్తి అభివృద్ధికి అవసరమైన పూర్తి సహకారం ఇక్కడినుంచి అందించనున్నారు. సెమీ కండక్టర్ల తయారీకి అవసరమైన కీలక సాంకేతికతలను తెలంగాణలోనే అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. పరిశోధన నుంచి నైపుణ్యాభివృద్ధి, ప్రోటోటైపింగ్, చిప్ తయారీ వరకు సమగ్రమైన ఎకోసిస్టం నిర్మించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా కార్యాచరణ రూపొందించిందని శ్రీధర్ బాబు వెల్లడించారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక






# గందరగోళంగా సర్ ప్రక్రియ!

సర్ ప్రక్రియలో గందరగోళం కనిపిస్తోంది. బిఎల్‌వోలు ఎక్కడా సరిగా కనిపించడం లేదు. ముఖ్యంగా హైదరాబాద్ పట్టణంలో గేటెడ్ కమ్యూనిటీల్లో వారి ఆచూకీ లేదు. కనీసం సంప్రదించిన దాఖలాలు లేవు. మరోవైపు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ సర్ తుది అంకానికి చేరుకుంది. అధికారికంగా 14వ తేదీ ఆఖరు గడువు అయినా ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్‌వోలకు అందజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. డిజిటలైజేషన్‌కు సమయం కావాల్సి ఉండడంతో అధికారులు ముందస్తు జాగ్రత్త తీసుకుంటున్నారు. మరోవైపు పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నా ప్రజల్లో ఆశించిన స్పందన రావడం లేదని అధికారులు వాపోతుండగా ఆ ఫారాలను పూరించడం కష్టతరమని రాజకీయ పార్టీల ఏజెంట్లు వ్యాఖ్యానిస్తున్నారు. 'సర్' పక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. చివరి రోజులు సర్వర్ సమస్య తలెత్తకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ఇకపోతే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి ఒక్కచోటే ఓటు ఉండాలని.. అలాకాకుండా రెండు, అంతకన్నా ఎక్కువ చోట్ల ఓటు ఉంటే అది చట్టవిరుద్ధమని తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్ రెడ్డి తెలిపారు. అలా ఉంటే ఏడాది జైలు శిక్ష, జరిమానా పడుతుందని హెచ్చరించారు. ఇదంతా ఒక ఎత్తయితే ప్రవాసుల ఓట్ల గురించి ఎక్కడా ప్రస్తావించడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి లక్షల మంది జీవనోపాధి కోసం విదేశాల్లో ఉంటున్నారు. వారు అడపాదడపా వచ్చి వెళుతుంటారు. వారి గురించి ఎన్నికల సంఘం తెలియ చేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలోని ఓటరు జాబితా ఆధారంగా.. ఎవరికైనా రెండు చోట్ల ఓటు ఉంటే గుర్తించగలుగుతారు. అదే రెండు రాష్ట్రాల్లో ఉంటే దాన్ని ఈసీఐ గుర్తించాల్సి ఉంటుంది. ఒకే వ్యక్తికి రెండు మూడు చోట్ల ఓట్లు ఉన్నట్లు గుర్తిస్తే, విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని అంటున్నారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చి రెండు చోట్లా ఓటుహక్కు పొందినవారికి ఈసీఐ జారీచేసే నోటీస్ ఆధారంగా... ఏడాది జైలు శిక్షతో పాటు పెనాల్టీ కూడా పడుతుందని సీఈవో హెచ్చరించారు. 'సర్' ముఖ్య ఉద్దేశం.. ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి పేర్లను తొలగించడం, ఇతర తప్పులను సరిదిద్ది జాబితాను పూర్తిస్థాయిలో ఆధునీకరించడం లక్ష్యం. ప్రతి ఒక్క ఓటరూ ఈ పక్రియలో పాల్గొనాల్సిందేనని.. సాధారణ పౌరుల నుంచి సీఎం, పీఎం దాకా ప్రతి ఒక్కరూ ఎన్యూమరేషన్ ఫారం నింపాల్సిందేనని.. ఎవరికీ మినహాయింపులు ఉండవని ఇసి స్పష్టం చేసినా, సామాన్యుల చెంతకరు వెళ్లాల్సిన బిఎల్‌వోలు వెళ్లకుంటే దానికి ఎవరు బాధ్యతులన్నది ప్రశ్న. జీవనోపాధికై గల్ఫ్ తదితర దేశాలకు వెళ్లిన తెలుగువారిలో అత్యధికులు గ్రామీణులే. వీరి విద్యార్హతలు అంతంత మాత్రమే. చిన్న చితకా పనులు చేస్తూ ప్రతి నెలా క్రమం తప్పకుండా కొంత డబ్బును తమ కుటుంబాలకు పంపుతూ స్వదేశంలోని కుటుంబాలను పోషించుకుంటున్నారు. నే ఈ శ్రామిక జనులలో ఎక్కువ భాగం బడుగు, బలహీన వర్గాల వారే. పరాయి దేశంలో నివసిస్తున్నా, వారి మనసంతా సొంతూరు చుట్టే ఉంటుంది. సర్ కార్యక్రమంలో భాగంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మొదలైన ఆ 'సవరణ' పక్రియ అసంఖ్యాక ప్రవాసులపై ప్రత్యక్ష, పరోక్ష ప్రభావం చూపించడం ఖాయం. ఇప్పటి వరకు 'సర్' పూర్తయిన రాష్ట్రాలలో లక్షలాది వలస కార్మికులు, మహిళలు నష్టపోయారు. ఉపాధి వలసలు ఎక్కువగా ఉన్న తెలుగు రాష్ట్రాల్లో 'సర్' ప్రభావం ఉంటుంది. ప్రవాస కార్మికులు అవగాహనా రాహిత్యంతో ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. వారికి సరైన మార్గదర్శకత్వం చేసే నాయకత్వం కూడా కరువయింది. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం, ఒక వ్యక్తి ఒక ప్రదేశంలో ఆరు నెలలకు మించి నివాసం ఉండని పక్షంలో అతను లేదా ఆమె పేరును తొలగించడం ఖాయం. ప్రవాసులే కాదు, రాజకీయ నాయకులు సైతం ఓటరుగా తాము నమోదైన ప్రదేశాలలో నివసిస్తూ ఉండరనేది వేరే విషయం. ప్రవాసులు తమ పాస్-పోర్టుల్లో చిరునామాగా పేర్కొన్న ప్రదేశంలో ప్రవాస ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉన్నది. అయితే దేశవ్యాప్తంగా ఇలా ప్రవాస ఓటరుగా నమోదు చేసుకునే వారి సంఖ్య స్వల్పమే. ప్రవాస ఓటరుగా నమోదయితే రేషన్‌కార్డు గల్లంతవుతుందనే భయానికి తోడుగా పేర్లు, వయస్సులోని వ్యత్యాసాల కారణంగా ఈ రకమైన నమోదుకు అత్యధికులు ఇష్టపడడం లేదు. ప్రవాసులకు సంబంధించిన ఈ కీలక అంశాలపై సరైన సమాచారంతో సుదూర దేశంలో బతుకు దెరువు పొందుతున్న వారికి స్థానిక నాయకులు దిశా నిర్దేశర చేయవల్సిన అవసరం ఉంది. విదేశాలలో, ప్రత్యేకించి గల్ఫ్ దేశాలలో ఉపాధి పొందుతున్న తెలుగువారు లక్షల సంఖ్యలో ఉన్నారు. ఈ తెలుగు ప్రవాసుల ఉనికి విషయమై ఉభయ తెలుగు రాష్ట్రాల్ లో పాలకులకుగానీ, రాజకీయ పక్షాలకుగానీ ఎలాంటి సూచనలు చేయడం లేదు. ఇలా ఇక్కడ లేని వారి పేర్లు తొలగిస్తే విదేశాల్లో బతుకుదెరువు కోసం పోయిన వారి ఓట్లు గల్లంతు అవుతాయి. తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ లాంటి జిల్లాలోని పలు గ్రామాల వారు అనేక మంది గల్ఫ్ దేశాలలో జీవనోపాధి పొందుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు హైదరాబాద్ మహానగర పాతబస్తీలోని అన్ని నియోజకవర్గాల నుంచి కూడా గల్ఫ్‌కు వలస వచ్చిన ఓటర్లు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. వీరంతా జాగ్రత్త పడకపోతే ఓటు గల్లంతు ఖాయం.

# భారత్-న్యూజిలాండ్ బంధం మరింత బలోపేతం


- ఈ ప్రయాణం మున్ముందు మరింత విజయవంతమవుతుంది
- ప్రవాస భారతీయలు కృషి ఇందుకు ప్రధాన కారణం
- న్యూజిలాండ్ పర్యటనలో ప్రవాస భారతీయులతో మోడీ



**ఆక్లాండ్,జులై 11:** భారత్-న్యూజిలాండ్ వాకా(బోటు) ఇప్పుడు నూతన ప్రయాణాన్ని ఆరంభిం చేందుకు సిద్ధంగా ఉందని, ఇరు దేశాల మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతం కానుందని భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రయాణం మున్ముందు మరింత విజయవంతమవుతుందనే పూర్తి నమ్మకం తనకుందన్న మోదీ.. అది తనవల్ల కాదని, అందుకు న్యూజిలాండ్‌లోని భారతీయులే కారణమన్నారు. న్యూజిలాండ్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ రెండో రోజు పర్యటన కొనసాగింది. శనివారం ఆక్లాండ్‌లో ఆయన ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు స్నేహం, విశ్వాసం, విలువలు, బలమైన భవిష్యత్తు కోసం పరస్పర నిబద్ధతపై నిర్మితమయ్యా యని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు మోదీ. న్యూజిలాండ్ సంప్రదాయంలో విశిష్ట స్థానం కలిగిన 'వాకా'ను గురించి ప్రస్తావిస్తూ.. 'అదో పడవ మాత్రమే కాదని, ఉమ్మడి ప్రయాణానికి చిహ్నం' అని పేర్కొన్నారు. ఆక్లాండ్ నుంచి వెల్లింగ్టన్ వరకు, క్రైస్ట్‌చర్చ్ నుంచి క్వీన్స్‌టౌన్ వరకు విస్తరించి ఉన్న భారతీయ సమాజమే ఈ స్వర్ణయుగ ప్రయాణానికి నిజమైన నావికులని కొనియాడారు. భారతీయుల ప్రతిభను గుర్తించి సరైన అవకాశాలు కల్పించే అద్భుత దేశం న్యూజిలాండ్ అని అన్నారు. ఎయిర్ న్యూజిలాండ్ సీఈఓగా నిఖిల్ రవిశంకర్, గవర్నర్ జనరల్‌గా ఆనంద్ సత్యానంద్, క్రికెట్‌లో రచిన్ రవీంద్ర, ఇష్ సోధి, అజాజ్ పటేల్ వంటి భారత సంతతి వ్యక్తులు రాణించడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. అలాగే ఆ దేశంలోని పలు ప్రాంతాలకు బాంబే హిల్స్, కోరమాండల్, కలకత్తా స్ట్రీట్, ఢిల్లీ క్రెసెంట్, అమృత్‌సర్ స్ట్రీట్ వంటి భారతీయ పేర్లుండటాన్ని ఇరు దేశాల మధ్య ఉన్న అనుబంధానికి సంకేతమని పేర్కొన్నారు. ఈ దేశంతో తనకు 30 ఏళ్ల అనుబంధం ఉందని గుర్తుచేసిన మోదీ.. రాజకీయాల్లోకి రాకముందే న్యూజిలాండ్‌ను సందర్శించే అవకాశం వచ్చిందని చెప్పారు. నాడు ఓ న్యూజిలాండ్ వాసి తనకు మఫ్లర్, టోపీ, గ్లౌజులు కానుకగా ఇచ్చిన విషయాన్ని స్మరించుకున్నారు. ఆ మఫ్లర్‌ను ఇప్పటికీ జాగ్రత్తగా భద్రపరుచుకున్నానని, అందులో న్యూజిలాండ్ దేశీయుల ప్రేమనూ అంతే ఆప్యాయంగా కాపాడుకుంటున్నట్టు చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ సహా ప్రభుత్వ ప్రతినిధులు, లేబర్ పార్టీ నాయకులకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. భారత్-న్యూజిలాండ్ బంధాలకు అక్కడి అన్ని రాజకీయ పార్టీలు మద్దతివ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లడంలో ఎన్ఆర్ఐల పాత్ర కీలకమని స్పష్టం చేశారు.

# నన్ను చంపాలనుకుంటే ఇరాన్ మటాష్

- వేయి క్షిపణులు ఇరాన్‌పై ఏకకాలంలో దాడి
- ఊహించని విధంగా ఇరాన్‌ను అంతం చేస్తాం
- సైన్యానికి ఆదేశాలు ఇచ్చి పెట్టాను
- సొంత సోషల్ మీడియా ట్రూత్‌లో ట్రంప్ హెచ్చరికలు



**వాషింగ్టన్, జూలై 11 :** అమెరికా-ఇరాన్ మధ్య తాత్కాలిక ఒప్పందం కుదిరినప్పటికీ.. ఉద్రిక్తతలు ఏమాత్రం సమసిపోలేదు. రెండుదేశాలు పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో వార్నింగ్ ఇచ్చారు. ఒకవేళ వారు తనను హత్య చేయాలని ప్రయత్నిస్తే.. క్షిపణుల వర్షం తప్పదని హెచ్చరించారు. డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి ఘాటైన హెచ్చరిక జారీ చేశారు. తనపై హత్యాయత్నం చేయడానికి ఇరాన్ ప్రయత్నిస్తే, ఆ దేశంపై క్షిపణుల వర్షం తప్పదని వార్నింగ్ ఇచ్చారు. తాము ఇప్పటికే 1,000 క్షిపణులను సిద్ధం చేసి ఉంచామని ఆయన పేర్కొన్నారు. అవసరమైతే వేల క్షిపణులతో భారీ ప్రతీకార దాడులు జరుగుతాయని ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్' ద్వారా వెల్లడించారు. నన్ను హత్య చేయాలని ఇరాన్ ప్రయత్నిస్తే భారీ విధ్వంసం తప్పదు. 1,000 క్షిపణులు ఇప్పటికే లక్ష్యాలను గురిపెట్టి సిద్ధంగా ఉన్నాయి. అంతటితోనే ఆగదు. అవసరమైతే మరిన్ని దాడులు జరుగుతాయి. ఇప్పటికే ఈ విషయమై సైన్యానికి ఆదేశాలు అందాయి. ఇరాన్‌లోని అన్ని ప్రాంతాలను ధ్వంసం చేయడానికి అమెరికా సైన్యం సిద్ధంగా ఉంది' అని ట్రంప్ హెచ్చరించారు. తనపై ఇరాన్ హత్యాయత్నం చేసే అవకాశం ఉందని గతంలో కూడా ట్రంప్ ఆరోపించారు. అలాంటి ప్రయత్నం జరిగితే అమెరికా ప్రతిస్పందన అత్యంత తీవ్రంగా ఉంటుందని, ఇరాన్ కీలక సైనిక స్థావరాలపై భారీ దాడులు జరుగుతాయని స్పష్టం చేశారు. కాగా, ఇప్పటికే హోర్ముజ్ జలసంధి, అణు ఒప్పందం వంటి అంశాలపై ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో ఈ హెచ్చరికలు పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసే అవకాశం కనబడుతోంది. ఇరాన్‌లోని అన్ని ప్రాంతాలను పూర్తిగా ధ్వంసం చేయడానికి తమ సైన్యం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. అంతకుముందు మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. తనను చంపడంలో ఆ దేశం సఫలమైతే.. తదుపరి ఏం చేయాలన్నదానిపై ఇప్పటికే సూచనలు జారీ చేశానన్నారు. 'ఏదైనా జరిగితే.. ఇంతకు ముందెన్నడూ లేనంత భారీ స్థాయిలో ఇరాన్ పై బాంబుల వర్షం కురిపించాలని నేను సూచనలు జారీ చేశా. అయితే టెహ్రాన్ నన్ను చంపడంలో విఫలమవుతుందని ఆశిస్తున్నా అని పేర్కొన్నారు. హార్మూజ్‌లో ప్రయాణిస్తోన్న నౌకలపై ఇరాన్ దాడులు చేయడం.. ఆ వెంటనే ఆ దేశంపై అమెరికా క్షిపణుల వర్షం కురిపించడంతో మరోసారి పశ్చిమాసియాను యుద్ధమేఘాలు కమ్మేశాయి. ఈ క్రమంలోనే డీల్ ముగిసిందంటూ ట్రంప్ ప్రకటన చేశారు. దాంతో.. ఇప్పటికే అంగీకరించిన అంశాల్లో వేటినైనా ఉల్లంఘిస్తే ప్రతిచర్య తప్పదని ఇరాన్ హెచ్చరించింది. చర్చలను కొనసాగించాలని తాము కోరినట్లు ట్రంప్ చేసిన వ్యాఖ్యలను కూడా ఖండించింది. తాము లొంగిపోవడంతోనే యుద్ధం ముగియదని ఇరాన్ పార్లమెంటర్ స్పీకర్ ఘాలిబఫ్ పేర్కొన్నారు. యుద్ధాన్ని ముగించడం ప్రపంచ దేశాలకు ప్రాధాన్యాంశం. ఇరాన్ లొంగిపోవడంతో ఎప్పటికీ ఈ యుద్ధం ముగిసిపోదని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి. అమెరికన్లు ఎప్పుడైతే అవగాహన ఒప్పందాన్ని ఉల్లంఘిస్తారో.. అప్పుడు మమ్మల్ని మేము రక్షించుకోవడానికి సిద్ధంగా ఉంటాం అని వెల్లడించారు. అలాగే యుద్ధానికి సిద్ధంగా ఉన్నవారే.. అమెరికాతో చర్చలు జరపగలరని వ్యాఖ్యానించారు.

# వియత్నాంలో ఘోర ప్రమాదం

- పర్యాటక బోటు బోల్తా పడి 19మంది జలసమాధి
- పలువురు పరిస్థితి విషమం..ఆస్పత్రిలో చికిత్స
- విహార యాత్రకు వెళ్లిన తెలుగువాలో పలువురు మృతి
- మృతుల్లో కడప, మచిలీపట్నలంకు చెందిన వారు
- రంగంలోకి దిగిన భారత ఎంబసీ..హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు



**హనోయ్,జులై 11:** వియత్నాంలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఫు క్వాక్ ద్వీపం సమీపంలో భారతీయ పర్యాటకులతో వెళ్తున్న బోటు ఒక్కసారిగా తీవ్రమైన అలలకు బోల్తా పడింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు 19 మంది తెలుగు పర్యాటకులు జలసమాధి అయ్యారు. వెంటనే రంగంలోకి దిగిన సహాయ బృందాలు రక్షణ చర్యలు చేపట్టారు. స్థానిక అధికారులతో కలిసి నేవీ సిబ్బంది సహాయ చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఇందులో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. భారత కాలమాన ప్రకారం ఉదయం 11: 30 గంటలకు బోటు ప్రమాదం జరిగినట్లుగా తెలుస్తోంది. ఓ మొబైల్ కంపెనీ తరపున డీలర్స్ టూరిస్ట్‌లుగా వెళ్లారు. ఏపీ నుంచి 30, తెలంగాణ నుంచి 45 మంది వెళ్లారు. ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ కూడా లైఫ్ జాకెట్లు వేసుకోలేదని తెలుస్తోంది. ఇక మృతుల వివరాల కోసం అధికారులు హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేశారు. బాధిత కుటుంబాలు కంట్రోల్ రూమ్‌లను సంప్రదించవచ్చుని, ఎలాంటి సహాయానికైనా, సందేహాలకైనా తాము అందుబాటులో ఉన్నామని భారత మిషన్ తెలిపింది. మొత్తం బోటులో 75 మంది భారతీయులు ఉండగా.. ఎక్కువగా తెలుగు రాష్ట్రాలకు చెందినవారు, తమిళనాడు వాసులు చనిపోయినట్లుగా తెలుస్తోంది. అయితే వారి పూర్తి వివరాలు, స్వస్థలాలు, కుటుంబ సభ్యుల సమాచారం సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. భారత రాయబార కార్యాలయం కూడా వియత్నాం అధికారులతో సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. బోటు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులా, సాంకేతిక లోపమా, లేక మరే ఇతర కారణమా అన్న కోణంలో అధికారులు విచారణ చేపట్టారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక దర్యాప్తు అనంతరం వెల్లడికానున్నాయి. ఈ విషాద ఘటనతో మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. తెలుగు రాష్ట్రాల్లోని బంధువులు, స్నేహితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాలను స్వదేశానికి తరలించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఈ విషయాన్ని వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం అధికారికంగా ధ్రువీకరించింది. ప్రస్తుతం స్థానిక అధికారులు ఘటనా స్థలంలో ముమ్మరంగా గాలింపు, సహాయక చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన కచ్చితమైన వివరాలు, బోటులో మొత్తం ఎంతమంది పర్యాటకులు ఉన్నారు.. వారి ప్రస్తుత పరిస్థితి ఏమిటన్నది ఇంకా పూర్తిగా తెలియరాలేదు. ఈ ఘటనపై భారత రాయబార కార్యాలయం సామాజిక మాధ్యమం 'ఎక్స్ లో స్పందిస్తూ.. 'ఓ విషాదకరమైన ఘటనలో, కొన్ని గంటల క్రితం వియత్నాంలోని ఫు క్వాక్ ద్వీపం సమీపంలో పలువురు భారతీయ పర్యాటకులతో వెళ్తున్న బోటు బోల్తాపడింది. స్థానిక అధికారులు రెస్క్యూ ఆపరేషన్లు కొనసాగిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నాం' అని పేర్కొంది. ప్రమాదానికి గురైన పర్యాటకుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు, అవసరమైన సహాయం చేయడానికి భారత ప్రభుత్వం వియత్నాంలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటుచేసింది. ప్రమాద సమయంలో బోటులో సుమారు 30 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన సుమారు 18 మంది మరణించినట్లు సమాచారం. కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కిషోర్ కుటుంబం కూడా ఈ విహారయాత్రలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో కిషోర్ భార్య మరణించగా, అపస్మారక స్థితిలోకి వెళ్లిన కిషోర్‌ను స్థానిక ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. స్థానిక అధికారుల సహాయక చర్యలు పూర్తిగా ముగిసిన అనంతరం ఈ వివరాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కడప జిల్లాకు చెందిన డిస్ట్రిబ్యూటర్ శ్రీధర్, మచిలీపట్నంకు చెందిన జయశ్రీ మరణించారు. కడపకు చెందిన మరో డిస్ట్రిబ్యూటర్ నయీం ఒడ్డున ఉండటంతో ప్రాణాలు దక్కించుకున్నారు. ట్రిప్‌లో భాగంగా వీరు మూడు పడవల్లో సముద్రంలో విహార యాత్రకు వెళ్లారు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో హాన్ మే రుట్ నుంచి అన్‌థోయ్ పోర్టుకు ఒక స్పీడ్ బోట్ బయల్దేరింది. అందులో 32 మంది భారతీయులు, నలుగురు సిబ్బంది ఉన్నారు. ఈ పడవ తీరానికి 400 మీటర్ల దూరంలో ఉండగా.. సముద్రంలో ఒక్కసారిగా బోల్తా పడింది. దీంతో ప్రయాణికులు నీటిలో మునిగిపోయారు. ప్రమాదం జరిగిన వెంటనే గమనించిన సమీపంలోని ఇతర పర్యాటక బోట్ల నిర్వాహకులు.. అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే, బోటు పూర్తిగా తలకిందులు కావడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. అటు అలల ఉధృతి కూడా తీవ్రంగా ఉండటంతో టూరిస్టులను కాపాడటం కష్టంగా మారింది. వీరిలో కొందరిని రెస్క్యూ సిబ్బంది రక్షించి ఆసుపత్రికి తరలించారు. మరికొందరు గల్లంతవ్వగా వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. వాతావరణ మార్పుల కారణంగానే బోటు మునిగినట్లు తెలుస్తోంది.

# ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి కి ప్రాణరక్షణ

**చాకచక్యంగా స్పందించిన సత్తుపల్లి 108 సిబ్బంది**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని సత్తుపల్లి 108 అంబులెన్స్ సిబ్బంది సకాలంలో స్పందించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. గ్రామానికి చెందిన పుల్లయ్య కుటుంబ కలహాల నేపథ్యంలో శనివారం విషపూరిత పదార్థం సేవించి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సమాచారం అందుకున్న వెంటనే సత్తుపల్లి 108 ఈఎంటీ గొల్లమందల కృష్ణ, పైలెట్ కట్టం మహేష్ సంఘటన స్థలానికి చేరుకుని బాధితుడికి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం ఆక్సిజన్‌తో పాటు అవసరమైన అత్యవసర వైద్య సేవలు అందిస్తూ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యంలో బాధితుడి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ చికిత్స కొనసాగించారు. సమయస్ఫూర్తితో స్పందించి బాధితుడి ప్రాణాలను కాపాడిన 108 సిబ్బంది సేవలను మూడు జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ షేక్ నజీరుద్దీన్, ఖమ్మం జిల్లా 108 మేనేజర్ అవులూరి దుర్గాప్రసాద్ అభినందించారు. కిష్టారం గ్రామస్థులు కూడా 108 సిబ్బంది తక్షణ స్పందనను ప్రశంసించారు.

# బండి సంజయ్ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు

**రోగులకు పండ్లు , విద్యార్థు లకు నోటు పుస్తకాలు పంపిణీ**



**ఉద్యమ కెరటం, కెరమెరి:** కేంద్ర హోం సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ కెరమెరి మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మండల అధ్యక్షుడు సెడ్మకి తుకారాం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం నవోదయ విద్యాలయంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. సమాజ సేవే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు భానోత్ వెంకట్ నాయక్, బీజేపీ యువ మోర్చా మండల అధ్యక్షుడు అలుగొట్టు నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శి రంగు శ్రీకాంత్, చవాన్ కిషన్, సెండే వినోద్, రాథోడ్ ఆత్మరాం, శేఖర్, బాలాజీ, దృమన, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహనతోనే ప్రమాదాల నివారణ

**ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, పార్కును సందర్శించిన విద్యార్థు లు**




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రోడ్డు భద్రత నియమాలపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉంటే ప్రమాదాలను నివారించవచ్చని ట్రాఫిక్ సీఐ ప్రణయ్ కుమార్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ట్రాఫిక్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం సుమారు 40 మంది ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, ట్రాఫిక్ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, క్రమశిక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ విద్యార్థులకు ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు గుర్తులు, రోడ్డు దాటే విధానం, జీబ్రా క్రాసింగ్ వినియోగం, పాదచారుల భద్రత, హెల్మెట్, సీటుబెల్ట్ ప్రాముఖ్యత గురించి వివరించారు. అలాగే మైనర్ డ్రైవింగ్, అధిక వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ ద్వారా కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ పార్కులో ఏర్పాటు చేసిన నమూనా రహదారులు, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు గుర్తులను విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపిస్తూ వాటి వినియోగాన్ని వివరించారు. చిన్నప్పటి నుంచే రోడ్డు భద్రతా నియమాలను అలవాటు చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగవచ్చని తెలిపారు. విద్యార్థులు తాము ట్రాఫిక్ నియమాలను పాటించడంతో పాటు తమ తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగించేలా ప్రోత్సహించాలని సూచించారు. చిన్నారులు రోడ్డు భద్రతకు రాయబారులుగా మారితే ప్రమాదాల నివారణలో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు.

# జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- **రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, గిరిజన సంక్షేమం, పేదల గృహ నిర్మాణం వంటి అన్ని రంగాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ జిల్లాల సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం జిల్లా లో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా ఎస్.పి. నితికా పంత్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, శాసన మండలి సభ్యులు దండే విఠల్, ఆసిఫాబాద్ శాసనసభ్యులు కోవ లక్ష్మి , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్, వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్,మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఆసిఫాబాద్ మండలం మానిక్‌గూడ, వాంకిడి మండలం కోమటిగూడ గ్రామాలలో 20 లక్షల రూపాయల చొప్పున నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించడం జరిగిందని, ఈ భవనాల ద్వారా గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. గ్రామపంచాయతీలు గ్రామాల అభివృద్ధికి కేంద్రబిందువులుగా మారాలని, ప్రజలకు అవసరమైన సేవలు పారదర్శకంగా అందించాలని అధికారులను ఆదేశించారు. కెరమెరి మండలం ధనోరా గ్రామంలో 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన మహిళా సమాఖ్య సంఘ భవనాన్ని ప్రారంభించడం జరిగిందని, మహిళా సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం కావడానికి ప్రభుత్వం అనేక సంక్షేమ, స్వయం ఉపాధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళలు సంఘటితంగా ముందుకు సాగి స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని కుటుంబాలతో పాటు సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ఆసిఫాబాద్ మండలం అడ గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల ను ప్రారంభించి నిరుపేద కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కెరమెరి మండలం సుర్దాపూర్ గ్రామానికి చెందిన పోడు రైతులు తాతముత్తాతల కాలం నుంచి తాము సాగు చేసుకుంటున్న భూములను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, సాగు భూములలోకి వెళ్లకుండా పోలీసుల ద్వారా ఇబ్బందులు ఎదురవుతున్నాయని రాష్ట్ర మంత్రి దృష్టి కి తీసుకురాగా స్పందిస్తూ 2005 సంవత్సరానికి ముందు నుంచి సాగు చేస్తున్న పాత పోడు భూముల విషయంలో రైతులను ఎట్టి పరిస్థితులలోనూ ఇబ్బందులకు గురిచేయవద్దని అధికారులకు సూచించారు. అదే సమయంలో కొత్తగా అటవీ భూములను ఆక్రమిస్తూ పోడు సాగు చేయకూడదని, పోడు భూములకు సంబంధించిన అంశం కేంద్ర ప్రభుత్వ పరిధిలోని చట్టాలకు సంబంధించినదని, గిరిజనేతర రైతుల సంబంధిత సమస్యలపై అధికారులతో చర్చించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సుర్దాపూర్ గ్రామ రైతుల భూ సమస్యపై జిల్లా అధికారులు, అటవీశాఖ అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి, చట్టపరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలించి సాగుకు అనుకూలమైన పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని తెలిపారు. భూములు, ఆస్తులు శాశ్వతం కావని, పిల్లలే మనకు నిజమైన ఆస్తిఅని, వారిని బాగా చదివించి ఉన్నత స్థానాలలో నిలబెట్టడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత అని తెలిపారు. విద్య ద్వారానే కుటుంబాలు, గ్రామాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని తెలిపారు. జిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమం, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, మహిళల సాధికారత, రైతుల సమస్యల పరిష్కారం వంటి అంశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# విద్యార్థుల భవిష్యత్తు కు ఉపాధ్యాయులే మార్గదర్శకులు

- **ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్**
- **సత్తు పల్లి లో ఘనంగా ఉపాధ్యాయ సదస్సు**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. విద్యతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సేవాభావాన్ని విద్యార్థుల్లో పెంపొందించడం ద్వారా సమాజాభివృద్ధికి బాటలు వేయవచ్చని పేర్కొన్నారు. శనివారం సత్తుపల్లి పట్టణంలోని మాధురి ఫంక్షన్ హాల్‌లో రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఉపాధ్యాయ సదస్సు'కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వామి వివేకానంద బోధనలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని, వాటిని విద్యార్థులకు చేరవేయడంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల సేవలు అమూల్యమైనవని కొనియాడారు. కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి బోధమయానంద మహారాజ్, ఆర్ఐఎంఎస్ఇ కరస్పాం డెంట్ స్వామి ఆనంద మహారాజ్, రామకృష్ణ మిషన్ ఉప కార్యదర్శి స్వామి సితికంటానంద మహారాజ్ హాజరై ఉపాధ్యాయులకు మార్గనిర్దేశం చేశారు. విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం, సేవాభావం, దేశభక్తిని పెంపొందించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రెహాన బేగం కమల్ పాషా, ఎంఈఓ రాజేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, కార్యక్రమ నిర్వాహకులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు ఆశీర్వాద సభ విజయవంతం

- **సత్తు పల్లి నియోజకవర్గ నాయకులు, కార్యకర్త ల సమిష్టి కృషి అభినందనీయం**
- **సత్తు పల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గ పరిధిలోని జగన్నాథపురంలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయడంలో భాగస్వాములైన ప్రతిఒక్కరికీ సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సంక్షేమం, అభివృద్ధిని ఆకాంక్షిస్తూ నిర్వహించిన రైతు ఆశీర్వాద సభకు భారీ సంఖ్యలో రైతు సోదరులు, మహిళలు తరలివచ్చి సభను విజయవంతం చేయడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని పేర్కొన్నారు. సభకు హాజరైన ప్రతి రైతు, మహిళలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా జగన్నాథపురంలో జరిగిన రైతు ఆశీర్వాద సభ విజయవంతం కోసం సత్తుపల్లి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించడంతో పాటు సభ నిర్వహణకు సహకరించిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తల సేవలను ప్రత్యేకంగా అభినందించారు. సభ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి తమ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించారని తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాల నుంచి రైతులు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో జగన్నాథపురం రైతు ఆశీర్వాద సభకు తరలివచ్చి తమ ఆదరణను చాటారని పేర్కొన్నారు. సభ విజయవంతం వెనుక ప్రతి నాయకుడి కృషి, కార్యకర్త శ్రమ ఉందని, వారి సేవలను ఎప్పటికీ మరువలేమని తెలిపారు. రైతుల అభ్యున్నతి, సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. రైతుల కష్టాలను గుర్తించి వారికి అండగా నిలిచే కార్యక్రమాలకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ ఎంతో ఉత్సాహాన్ని ఇస్తోందన్నారు. రైతుల ఆశీర్వాదం, ప్రజల మద్దతుతో మరింత బాధ్యతగా పనిచేస్తామని తెలిపారు. "రైతు ఆశీర్వాద సభ" ఘన విజయం సాధించడం వెనుక రైతు సోదరులు, మహిళలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తల సమిష్టి కృషి ఉందన్నారు.

# ఘనంగా బండి సంజయ్ జన్మదిన వేడుకలు

- **కేక్ కట్ చేసి బీజేపీ నాయకుల సంబరాలు**



**ఉద్యమ కెరటం, తిర్యాణి:** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను తిర్యాణిలో శనివారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. బీజేపీ మండల అధ్యక్షుడు సార రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక కుమురంభీం చౌరస్తాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా తిర్యాణి మండల ఎన్నికల కన్వీనర్ పులి వెంకటేష్ మాట్లాడుతూ బండి సంజయ్ కుమార్ దేశానికి, పార్టీకి విశేష సేవలు అందిస్తున్న నాయకుడని కొనియాడారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు గాయంగి తిరుపతి, వల్క శ్రీధర్, ఎస్టీ మోర్చా జిల్లా నాయకులు మాధవి సీతారామ్, జిల్లా నాయకులు పులి వెంకటేష్, తొంగాల తిరుపతి, మండల ఉపాధ్యక్షుడు రంగు అరుణ్ గౌడ్, నాయకులు ఆత్రం సంతోష్, గోపాల్, ఎస్టీ మోర్చా జిల్లా నాయకుడు కనక హనుమంతరావు, సార శంకర్ గౌడ్, మంగు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీల ఇండ్ల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలి



**ఉద్యమ కెరటం, కెరమెరి:** మండలంలోని కేస్లాగూడ గ్రామపంచాయతీ పరిధిలో గల పీవీటీజీ గ్రామం చిన్నూగూడతో పాటు కేస్లాగూడలో పీఎం జన్మన్ పథకం కింద మంజూరైన ఇండ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోవా విజయ్ కుమార్ కోరారు. శనివారం ఆదిలాబాద్ ఎంపీ గోడం నాగేష్ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పీఎం జన్మన్ పథకం ద్వారా ఆదివాసీలకు గృహాలు మంజూరు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. ఇప్పటికే ఆమోదం పొందిన ఇండ్ల నిర్మాణాన్ని ఆలస్యం చేయకుండా ప్రారంభించాలని కోరారు. చిన్నూగూడ గ్రామానికి ప్రధాన రహదారి నుంచి సుమారు మూడు కిలో మీటర్ల మేర సరైన రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాకాలంలో దారి మొత్తం చిత్తడిగా మారి రాకపోకలు స్తంభించిపోతున్నాయని, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సైతం గ్రామానికి చేరుకోలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. వెంటనే చిన్నూగూడకు బీటీ రోడ్డు మంజూరు చేయడంతో పాటు కేస్లాగూడ(ఎ) గ్రామానికి వెళ్లే మధ్యలో నిలిచిపోయిన రహదారి పనులను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కేస్లాగూడ గ్రామపంచాయతీ పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో పాటు పెండింగ్లో ఉన్న ఇతర అభివృద్ధి పనులను కూడా త్వరితగతిన మంజూరు చేయాలని విన్నవించారు. జిల్లాలోని పలు మండలాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీ దృష్టి కి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో బీజేపీ పార్టీ కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై ఎంపీ గోడం నాగేష్తో సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ ని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి, రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ వెంకట్ నాయక్, కెరమెరి మండల అధ్యక్షుడు సెడ్మాకి తుకారాం తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో పొరపాట్ల కు తావులేకుండా చూడాలి

## పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ



**ఉద్యమ కెరటం, తాండూర్:** ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా బీఎల్ఏలు, సంబంధిత సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించాలని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ అన్నారు. శనివారం ఆసిఫాబాద్లో నిర్వహించిన బీఎల్ఏల సమావేశానికి వెళ్తున్న సందర్భంగా తాండూర్ మండలంలోని ఐబీ సుభద్ర కాలనీలో జరుగుతున్న ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఇంటింటికి తిరుగుతూ నమోదవుతున్న వివరాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎస్ఐఆర్ దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి అవసరమైన చోట కొత్త ఫొటోలను జత చేయాలని తెలిపారు. ఓటరు జాబితాలోని పొరపాట్లను సవరించడంతో పాటు కొత్త ఓటర్ల నమోదుకు చేపట్టిన ఈ ప్రత్యేక ప్రక్రియను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటర్లకు ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని, ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు అమూల్యమైందని పేర్కొన్నారు. ఒక్క అర్హుడి పేరు కూడా ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడం అందరి బాధ్యత అని అన్నారు. ఈ ప్రక్రియలో విద్యావంతులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పి.రఘునాథ్ రెడ్డి, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు ఈసా, నాయకులు ఎండి. ఇద్రిస్, శంకర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

- గ్రంథాలయ చైర్మన్ మల్లె పూల నర్సయ్య



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని మండల అబ్జర్వర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య అన్నారు. మండలంలోని కుమారి గ్రామంలో జరుగుతున్న ప్రక్రయిను శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా చూడటమే ఈ సర్వే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజలు బాధ్యతగా తమ వివరాలను నమోదు చేయించి సర్వే విజయవంతానికి సహకరించాలని కోరారు. గ్రామ సందర్శనలో భాగంగా బీఎల్ఓ, బీఎల్ ఏ-2 వద్ద నమోదవుతున్న వివరాలను పరిశీలించి, ఎలాంటి పొరపాటుకు తావులేకుండా పారదర్శకంగా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సర్వే పకడ్బందీగా జరిగేలా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అగ్గిమాల గోదావరి లస్మన్న, ఉప సర్పంచ్ ఆడెపు రవి, పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేష్, నేరడిగొండ కాంగ్రెస్ మండల కన్వీనర్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ ఆడే వసంత్‌రావు, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు జాదవ్ వసంత్ రావు, బజార్హత్నూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విఠల్, కుమారి మాజీ ఉప సర్పంచ్ నరేష్ రెడ్డి, రామ్ లక్ష్మణ్ గౌడ్, నారాయణ గౌడ్, బ్రహ్మయ్య, భీమ్‌రాజు గౌడ్, ఖాజా, జాదవ్ కపిల్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే భూ రీ-సర్వే లక్ష్యం

- భూ భారతి సమర్థవంతమైన అమలుకు ప్రాధాన్యత
- జిల్లా కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి





**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భూ భారతి చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా భూ రీ-సర్వే ప్రక్రియను అత్యంత ప్రాధాన్యంతో చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు.శనివారం ఖమ్మం సమీకృత కలెక్ట రేట్ నుంచి భూ రీ-సర్వే, భూ భారతి అమలు, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్లు, 2బీహెచ్‌కే ఇళ్ల పంపిణీ, విద్యార్థుల యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్ట ర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డిఎస్. లోకేష్ కుమార్ పాల్గొన్నారు. ఆదిలాబాద్ కలెక్ట రేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రాజర్షిషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధరణి స్థా నంలో భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చి రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ధరణి కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న 9.6 లక్షల సాదాబైనామా దరఖాస్తులను పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.భూ భారతి విజయవంతమైన అమలుకు భూ రీ-సర్వే తప్పనిసరి అని, నిపుణుల సూచనల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ఇందుకోసం శిక్షణ పొందిన 5,700 మంది లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టు గా చేపట్టిన భూ రీ-సర్వే ద్వారా 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమైనట్లు మంత్రి తెలిపారు. తొలి విడతలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీ-సర్వే నిర్వహిస్తున్నట్లు వివరించారు. సాదాబైనామా దరఖాస్తులను నిబంధనల మేరకు పరిష్కరించి, అర్హులైన వారికి నోటీసులు త్వరగా జారీ చేయాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఆర్ఎస్. చిత్రు, ఆర్డీ ఓ జగదీశ్వర్ రావు, ఉట్నూర్ ఆర్డీఓ మోహన్ సింగ్, ఏఓ వర్ణ తదితరులు పాల్గొన్నారు.

# భూముల రీసర్వేను పారదర్శకంగా పూర్తి చేయాలి

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** రాష్ట్రంలో భూముల రీసర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డిఎస్.లోకేష్ కుమార్, గృహ నిర్మాణ శాఖ ఎండి. విపి.గౌతమ్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్‌లతో కలిసి అన్ని జిల్లాల కలెక్ట ర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా భూముల సర్వే, రీసర్వే అమలు తీరు, పురోగతి, భూ భారతి, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్లు, రెండు పడక గదుల ఇండ్ల పంపిణీ, విద్యార్థుల యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రెవెన్యూ మ్యాప్లు అందుబాటులో లేని గ్రామాలకు శాశ్వత భూ రికార్డుల రూపకల్పన లక్ష్యంగా ప్రభుత్వం సమగ్ర సర్వే కార్యక్రమాన్ని చేపట్టి ందన్నారు. ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, జీపీఎస్ ఆధారిత సర్వే పరికరాలు, డిజిటల్ మ్యాపింగ్ విధానాలతో రీసర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రీసర్వేలో ప్రతి దశలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లా కలెక్ట ర్లు స్వయంగా పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షించాలని, అవసరమైన చోట తక్షణ నిర్ణయాలు తీసుకుని ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. గ్రామస్థులకు రీ సర్వేపై పూర్తి అవగాహన కల్పించి, వారి అభ్యంతరాలు, సందేహాలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమగ్ర సర్వే పూర్తయిన తర్వాత భూ రికార్డులు మరింత ఖచ్చితత్వంతో సిద్ధమై భూ వివాదాల పరిష్కారం సులభతరం అవుతుందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూ భారతి కింద భూ రీ-సర్వే కోసం శిక్షణ పొందిన 5,700 మంది లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని, రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నక్షాలు లేని 413 ప్రాంతాల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన రీసర్వే ద్వారా 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కరించామని తెలిపారు. సాదాబైనామా దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి త్వరగా నోటీసులు జారీ చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ భూముల రీసర్వే, భూ భారతి, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్లు తదితర ప్రభుత్వ పథకాల అమలులో నిబంధనల ప్రకారం అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ వి.రాములు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు ఘన సన్మానం



**ఉద్యమ కెరటం, తాండూర్:** ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు డైరెక్ట ర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామిని తాండూర్ మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. శనివారం యాదగిరిగుట్టలో ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. దేవస్థానం అభివృద్ధికి, భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గట్టు మురళీధర్ రావు, ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, తాండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెద్దబోయిన శంకర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా ఇంచార్జి మంత్రిని కలిసిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సింగరేణి అతిథి గృహానికి వచ్చిన రాష్ట్ర ఆబ్కారీ, మధ్య నిషేధ, పర్యాటక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ తో పాటు డీసీపీ ఎ.భాస్కర్, ఆబ్కారీ మద్యనిషేధ శాఖ పర్యవేక్షకులు చాణక్య, సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు మంత్రిని కలిసి మొక్కను అందజేశారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు, పరిపాలనా అంశాలపై ఈ సందర్భంగా అధికారులతో మంత్రి చర్చించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఓటరు ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)లో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని కౌన్సిలర్ శాలిని యోగేష్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని 39వ వార్డులో నిర్వహించిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటర్లకు అవగాహన కల్పిస్తూ, వారికి అవసరమైన సేవలను అందించారు. ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించడంతో పాటు, ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, సవరణలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతిఒక్కరూ ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి బీఎల్ఓలకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

# ఐఎన్ టియుసి భీంపూర్ అధ్యక్షుడిగా రేణికుంట శ్రీనివాస్




**ఉద్యమ కెరటం, భీంపూర్:** ఐఎన్‌టియుసి భీంపూర్ మండల అధ్యక్షుడిగా రేణికుంట శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం జరిగిన కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా ఐఎన్‌టియుసి అధ్యక్షుడు మునిగేల నర్సింగ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మునిగేల నర్సింగ్ మాట్లాడుతూ మండలంలో కార్మిక విభాగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, కార్మికుల హక్కుల సాధన కోసం నూతన కమిటీ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన జిల్లా నాయకత్వానికి రేణికుంట శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి ముఖ్య నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# బోరిగాం సమీపంలో పెద్ద పులి కలకలం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని బోరిగాం గ్రామపంచాయతీ పరిధిలోని దూదిగండి సమీపంలో శనివారం పెద్దపులి కనిపించినట్లు స్థానికులు తెలిపారు. అనంతరం అది గుత్పాల గ్రామం వైపు వెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనతో బోరిగాం, గుత్పాల గ్రామాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అడవికి ఆనుకొని ఉన్న ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశువులను ఒంటరిగా మేతకు పంపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఘటనపై అటవీ శాఖ అధికారులు వెంటనే స్పందించి పెద్దపులి సంచారాన్ని గుర్తించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితా సవరణ అత్యంత కీలకం

**ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణా రావు**

**అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి**





**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ అత్యంత కీలకమైందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని వడ్డె పల్లి గార్డెన్‌లో శనివారం నిర్వహించిన ఎస్ఐఆర్ విస్తృత అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ అధ్యక్షత కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా, అనర్హుల పేర్ల తొలగింపు, తప్పుల సవరణ ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ప్రజల్లో ఓటర్ల జాబితా సవరణపై అవగాహన కల్పిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. అనంతరం డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల బీఎల్ఏలు బాధ్యతాయుతంగా పనిచేసి అర్హత కలిగిన ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద పల్లిఎంపీ వంశీకృష్ణ, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్, బీఎల్ఏ ఇంచార్జి రాంగోపాల్ వర్మ, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, మాజీ డీసీసీ అధ్యక్షులు విశ్వప్రసాద్ రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇంచార్జి శ్యాంనాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్లు ఇరుకుల మంగ, కుడిమేత విశ్వనాథ్, డీసీసీ కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, బీఎల్ఏలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బిఎల్ఓకు ఫామ్ ఇచ్చారా...ఓటు భద్రమే..!

- **ఎస్ఐఆర్-2026 స్పీడ్ పెంచిన అధికారులు...ఓటర్లపై ఫోకస్**
- **ఈరోజు ఫామ్...రేపటి ఓటు అంటూ అధికారుల విజ్ఞప్తి**
- **నిర్లక్ష్యం చేస్తే ఓటు ప్రమాదంలో..దుండిగల్ ఓటర్లకు అలర్ట్**

**ఉద్యమ కెరటం,కుత్బుల్లాపూర్**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్ )-2026 ప్రక్రియలో కీలక ఘట్టమైన ఎన్యుమరేషన్ ఫామ్‌ల సేకరణపై ఎన్నికల యంత్రాంగం దృష్టి సారించింది. ఇప్పటికే బూత్ లెవల్ ఆఫీసర్లు (బిఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఫామ్‌లు పంపిణీ చేయగా, ఇప్పుడు వాటిని గడువులోపు పూర్తి చేసి తిరిగి సమర్పించడం అత్యంత కీలకంగా మారింది. ఈ దశలో ఓటర్ల నిర్లక్ష్యం వారి ఓటు హక్కుపై ప్రభావం చూపే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్ మాట్లాడుతూ, ప్రతి ఓటరు తనకు అందిన ఎన్యుమరేషన్ ఫామ్‌ను సరైన వివరాలతో నింపి వచ్చే రెండు నుంచి మూడు రోజుల్లోపు సంబంధిత బిఎల్ఓకు అందజేయాలని సూచించారు. సమర్పించిన వివరాల ఆధారంగానే డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధమవుతుందని, గడువులోపు ఫామ్‌లు ఇవ్వని వారి పేర్లు జాబితాలో లేకపోయే పరిస్థితి ఏర్పడవచ్చని స్పష్టం చేశారు.ఎస్ఐఆర్-2026 కేవలం ఓటరు జాబితా సవరణ కార్యక్రమం మాత్రమే కాకుండా, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, ఖచ్చితత్వాన్ని పెంచే ప్రక్రియ అని అధికారులు పేర్కొంటున్నారు. అందుకే ప్రతి కుటుంబం ఈ కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకుని ఫామ్‌లను ఆలస్యం చేయకుండా సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.దుండిగల్ సర్కిల్ పరిధిలోని ప్రతి ఓటరు తన ఓటు హక్కును సురక్షితంగా కొనసాగించుకోవాలంటే ఎన్యుమరేషన్ ఫామ్‌ను సకాలంలో బిఎల్ఓకు అందజేయడం తప్పనిసరి అని అధికారులు స్పష్టం చేశారు. బిఎల్ఓ వివరాలు లేదా ఇతర సమాచారం కోసం ఎన్నికల సంఘం అధికారిక పోర్టల్‌ను (https://voters.eci.gov.in/) సంప్రదించాలని సూచించారు.

# సత్తుపల్లి సింగరేణి గేట్ల వద్ద ఉద్రిక్తత

- **కార్మికుల హక్కులను కాలరాస్తే సహించేది లేదు**
- **తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్లిన కల్వకుంట్ల కవిత**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** టీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన 'సింగరేణి బాయి బాట' కార్యక్రమంలో భాగంగా శనివారం సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో సింగరేణి కార్మికులను కలిసేందుకు వచ్చిన తెలంగాణ రక్షక సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పర్యటన ఉద్రిక్తతకు దారితీసింది. కవిత పర్యటనకు అనుమతి లేదంటూ సింగరేణి అధికారులు, పోలీసులు గేట్లకు తాళాలు వేసి ఆమెను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కవితతో పాటు వచ్చిన నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో గేట్లకు వేసిన తాళాలను పగలగొట్టి, గేట్లను తోసుకుంటూ లోపలికి వెళ్లారు. సింగరేణి కార్మికులను కలవ కుండా అడ్డుకోవడం సరికాదని కవిత మండిపడ్డారు. కార్మికుల హక్కులను కాలరాస్తే సహించేది లేదని, సింగరేణి కార్మికుల సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని ఆమె స్పష్టం చేశారు. అనంతరం హెచ్ఎంఎస్ నాయకులు, సింగరేణి కార్మికులతో కవిత సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాలపై తీవ్ర విమర్శలు చేశారు. ఆ సంఘాలు ప్రభుత్వానికి లొంగిపోయి కార్మికుల హక్కులను కాపాడటంలో విఫలమయ్యాయని ఆరోపించారు. సింగరేణి కార్మికులు, వారి కుటుంబాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మికుల పిల్లలకు సరైన పాఠశాల సదుపాయాలు, కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో లేవని పేర్కొన్నారు. కార్మికులు విధులు నిర్వహించేందుకు ఉపయోగించే పనిముట్లు సైతం నాసిరకంగా ఉన్నాయని ఆరోపించారు. సింగరేణి అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న కార్మికుల సంక్షేమాన్ని విస్మరించడం తగదన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రక్షక సేన తరఫున నిరంతరం పోరాటం చేస్తామన్నారు. కవిత పర్యటనను అడ్డుకోవడం, అనంతరం గేట్ల తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్లిన ఘటనతో జేవీఆర్ ఓసీ వద్ద కొద్ది సేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల సాకారం

- **లబ్ధిదారులతో గృహప్రవేశం చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** పేద ప్రజల చిరకాల స్వప్నమైన సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గుడిహత్నూర్ మండలం కొల్హారి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను శనివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, ఇళ్ల నిర్మాణ నాణ్యత, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సురక్షితమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్లను జాగ్రత్తగా సంరక్షించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం కొల్హారి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటరు నమోదు రికార్డులను పరిశీలించి, ప్రక్రియ పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా తయారీలో పూర్తి పారదర్శకత పాటించాలని అధికారులను ఆదేశించారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి యువతీ, యువకుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. నకిలీ ఓట్లు, ఒకే వ్యక్తి పేరు రెండు చోట్ల నమోదు కావడం, మరణించిన వారి పేర్లు జాబితాలో కొనసాగడం వంటి లోపాలు లేకుండా



క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టాలని తెలిపారు. ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పీఏసీఎస్ చైర్మన్‌గా మంగ్నలె బాలు పేరును ఖరారు చేయాలి

- **పార్టీ బలోపేతానికి సీనియర్ల నిర్ణయం కీలకం**



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** పీఏసీఎస్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో స్థానిక రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఈ క్రమంలో పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తూ, ప్రజలతో సత్సంబంధాలు కలిగిన బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు మంగ్నలె (బాలు వాణి) పేరును పీఏసీఎస్ చైర్మన్ పదవికి పరిశీలించి ఖరారు చేయాలని మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు. పార్టీ భవిష్యత్తు, బలోపేతాన్ని దృష్టిలో ఉంచుకుని నాయకత్వం సరైన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్, మాజీ ఎంపీ సోయం బాపురావులకు మండల సీనియర్ నాయకులు ప్రత్యేకంగా వినతులు అందజేస్తున్నారు. మంగ్నలె బాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ నమ్మకమైన నాయకుడిగా గుర్తింపు పొందారని తెలిపారు. రైతులు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పీఏసీఎస్‌కు సమర్థవంతమైన నాయకత్వం అవసరమని, అందుకు బాలు వంటి నాయకుడికి అవకాశం కల్పించడం అభిప్రాయపడ్డారు. పార్టీలోని పెద్దలు, సీనియర్లను గౌరవిస్తూ అందరినీ కలుపుకుని వెళ్లే స్వభావం మంగ్నలె బాలుకు ఉందని, ఆయనకు చైర్మన్ పదవి దక్కితే పార్టీకి మరింత బలం చేకూరుతుందని పేర్కొన్నారు. సహకార సంఘం అభివృద్ధి, పార్టీ పటిష్టత కోసం నాయకత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.మంగ్నలె బాలు పేరును చైర్మన్ రేసులో పరిగణలోకి తీసుకుని అవకాశం కల్పించాలని మాజీ జెడ్పీటీసీ మస్కే మాధవ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గణేష్ ముండే, సీనియర్ నాయకులు ససనే మాధవ్, గోవింద్ బుద్దే, కె.శివదాస్, బాలేరావు లక్ష్మణ్, మిలింద్ వాగ్మారే తదితరులు విజ్ఞప్తి చేశారు.

# సాంగ్వి–కేళీ(బి) రహదారి దుస్థితి

- **బురదమయంగా మారిన మార్గం**
- **ఇబ్బందుల్లో గ్రామస్తులు**

**ఉద్యమ కెరటం, కెరమెరి:** మండలంలోని సాంగ్వి నుంచి కేళీ(బి) గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. వర్షాకాలం ప్రారంభం కావడంతో రోడ్డు మొత్తం బురదమయంగా మారి, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా చుట్టుపక్కల పొలాల నుంచి మట్టి రోడ్డు పైకి చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ సమస్యను గ్రామస్తులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రాణాలతో చెలగాటంగా ప్రయాణం..**

ఈ రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు చెబుతున్నారు. బురదలో వాహనాలు చిక్కుకుపోవడం, అదుపుతప్పి జారిపడటం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రాకపోకలు మరింత కష్టతరంగా మారుతున్నాయని వాపోతున్నారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చే నాయకులు ఆ తర్వాత సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. సమస్య పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.



# డి.పోచంపల్లిలో భారీ షెడ్ కలకలం..!

**ఉద్యమ కెరటం, కుత్బుల్లాపూర్**

దుండిగల్ సర్కిల్ పరిధిలోని డి. పోచంపల్లి గ్రామంలో, దుండిగల్ పోలీస్ స్టేషన్ వెనుకలో సర్కిల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో భారీ షెడ్ నిర్మాణం కొనసాగుతుండటం స్థానికంగా చర్చనీయాంశమైంది. షెడ్ నిర్మాణానికి అవసరమైన అనుమతులు లేవు? , నిబంధనల ప్రకారం ఉండాల్సిన సెట్‌బ్యాక్‌లు పాటించకుండా పనులు జరిగాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇంత పెద్ద షెడ్ నిర్మాణం జరుగుతున్నప్పటికీ, దానిపై టౌన్ ప్లానింగ్ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సాధారణ ప్రజల చిన్నపాటి నిర్మాణాల విషయంలో వెంటనే నోటీసులు జారీ చేసే అధికారులు, ఇలాంటి భారీ నిర్మాణాల విషయంలో మాత్రం మౌనం పాటించడం వెనుక కారణమేంటనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.

**ఎవరికి అండగా అధికారులు?**

ఈ షెడ్ నిర్మాణానికి టౌన్ ప్లానింగ్ నుండి సహకారం ఉండడం వల్లే? పనులు నిరాటంకంగా కొనసాగాయనే ప్రచారం స్థానికంగా జోరుగా సాగుతోంది. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన వ్యవస్థే వాటికి అండగా నిలుస్తోందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమంగా నిర్మించిన షెడ్‌ను సక్రమం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయా? అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి.

**ప్రజల ప్రశ్నలకు సమాధానం ఎప్పుడు?**

దుండిగల్ సర్కిల్ కార్యాలయానికి సమీపంలోనే ఈ నిర్మాణం కొనసాగుతుంటే సంబంధిత అధికారులకు సమాచారం లేదా? తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అనే అంశాలు ఇప్పుడు ప్రధాన చర్చగా మారాయి. నిబంధనలు అందరికీ సమానంగా అమలవుతున్నాయా? లేక పలుకుబడి ఉన్నవారికి వేరే నిబంధనలు అమలవుతున్నాయా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**వెంటనే విచారణ చేయాలి**

ఈ నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, టౌన్ ప్లానింగ్ ఆమోదాలు, సెట్‌బ్యాక్‌ల అమలు తదితర అంశాలపై సమగ్ర విచారణ చేపట్టి, అక్రమాలు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



# భారీగా తగ్గిన బంగారం ధరలు

హైదరాబాద్, జులై 11 : బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి శనివారం శుభవార్త అందింది. దేశవ్యాప్తంగా బంగారం ధరలు గణనీయంగా తగ్గాయి. పది గ్రాముల ఇరవై నాలుగు క్యారెట్ల బంగారం ధరపై రూ.490, ఇరవై రెండు క్యారెట్ల బంగారంపై రూ.450, పద్దెనిమిది క్యారెట్ల బంగారంపై రూ.370 తగ్గుదల నమోదైంది. తాజా ధరల ప్రకారం హైదరాబాద్‌లో పది గ్రాముల ఇరవై నాలుగు క్యారెట్ల బంగారం ధర రూ.1,44,330కు చేరుకోగా, ఇరవై రెండు క్యారెట్ల బంగారం ధర రూ.1,32,300గా నమోదైంది. పద్దెనిమిది క్యారెట్ల బంగారం ధర రూ.1,08,250గా ఉంది. తెలంగాణలోని వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ నగరాల్లోనూ ఇదే ధరలు కొనసాగుతున్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ, కడప నగరాల్లో కూడా బంగారం ధరలు ఒకే స్థాయిలో నమోదయ్యాయి. దేశంలోని ప్రధాన నగరాల విషయానికి వస్తే చెన్నైలో పది గ్రాముల ఇరవై నాలుగు క్యారెట్ల బంగారం ధర రూ.1,45,090గా ఉండగా, ఇరవై రెండు క్యారెట్ల బంగారం రూ.1,33,000, పద్దెనిమిది క్యారెట్ల బంగారం రూ.1,11,200కు చేరింది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు, వడోదరా, ఇండోర్, కాన్పూర్ నగరాల్లో మాత్రం హైదరాబాద్‌తో సమానంగా ఇరవై నాలుగు క్యారెట్ల బంగారం ధర రూ.1,44,330, ఇరవై రెండు క్యారెట్ల బంగారం రూ.1,32,300, పద్దెనిమిది క్యారెట్ల బంగారం రూ.1,08,250గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల మార్పులు, డాలర్ మారకం విలువ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల ప్రభావంతో బంగారం ధరల్లో ప్రతిరోజూ హెచ్చుతగ్గులు చోటుచేసుకుంటున్నాయని బులియన్ మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ధరలు తగ్గుముఖం పట్టడంతో కొనుగోలుదారులు ఆసక్తి చూపుతున్నట్లు వ్యాపారులు తెలిపారు.




# ఏఐ రహస్యాలపై యాపిల్-ఓపెన్ ఏఐ మధ్య న్యాయపోరు

**కాలిఫోర్నియా, జులై 11 :** కృత్రిమ మేధ రంగంలో పోటీ మరింత తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రపంచ ప్రముఖ సాంకేతిక సంస్థ యాపిల్, కృత్రిమ మేధ సంస్థ ఓపెన్‌ఏఐపై న్యాయపోరుకు దిగింది. తమ వాణిజ్య రహస్యాలను అక్రమంగా వినియోగించిందంటూ ఓపెన్‌ఏఐతో పాటు తమ మాజీ ఉద్యోగులపై యాపిల్ అమెరికాలోని కాలిఫోర్నియా ఉత్తర జిల్లా న్యాయస్థానంలో కేసు దాఖలు చేసింది. యాపిల్ దాఖలు చేసిన పిటిషన్ ప్రకారం, సంస్థకు చెందిన ఉత్పత్తుల రూపకల్పన, తయారీ విధానాలు, సరఫరా వ్యవస్థ, ఇతర కీలక సాంకేతిక వివరాలను ఇద్దరు మాజీ ఉద్యోగులు అక్రమంగా సేకరించి ఓపెన్‌ఏఐ హార్డ్‌వేర్ ప్రాజెక్టులకు అందించారని ఆరోపించింది. ఈ చర్యలు ముందస్తు ప్రణాళిక ప్రకారమే జరిగాయని, ప్రస్తుతం ఆ మాజీ ఉద్యోగుల్లో ఒకరు ఓపెన్‌ఏఐ హార్డ్‌వేర్ విభాగంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని పేర్కొంది. తమ వ్యాపార రహస్యాలను ఉపయోగించి ప్రత్యర్థి సంస్థకు ప్రయోజనం చేకూర్చే ప్రయత్నం జరిగిందని యాపిల్ వాదిస్తోంది. ఈ అంశంపై కోర్టు తక్షణ జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరింది. మరోవైపు యాపిల్ ఆరోపణలను ఓపెన్‌ఏఐ పూర్తిగా ఖండించింది. ఇతర సంస్థల వాణిజ్య రహస్యాలను వినియోగించే అవసరం తమకు లేదని, స్వతంత్ర పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి ఆధారంగానే తమ ఉత్పత్తులను రూపొందిస్తున్నామని స్పష్టం చేసింది. న్యాయస్థానంలో తమ వాదనలను సమర్పించి ఆరోపణలను తిప్పికొడతామని సంస్థ తెలిపింది. ప్రపంచ కృత్రిమ మేధ రంగంలో కీలక సంస్థల మధ్య చోటుచేసుకున్న ఈ న్యాయ వివాదం సాంకేతిక పరిశ్రమలో చర్చనీయాంశంగా మారింది. ఈ కేసు తీర్పు భవిష్యత్తులో కృత్రిమ మేధ పరిశ్రమలో వాణిజ్య రహస్యాల పరిరక్షణకు సంబంధించిన నిబంధనలపై ప్రభావం చూపే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



# హార్ముజ్ ఉద్రిక్తత.. చమురు సరఫరాపై ప్రభావం

**న్యూఢిల్లీ, జులై 11 :** అమెరికా-ఇరాన్ మధ్య పెరుగుతున్న సైనిక ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలు గణనీయంగా తగ్గడంతో అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలో ఆందోళన నెలకొంది. తాజా పరిస్థితుల కారణంగా చమురు, సహజ వాయువు సరఫరాపై అనిశ్చితి పెరుగుతున్నట్లు షిప్పింగ్ సంస్థలు వెల్లడించాయి. యుద్ధ ఉద్రిక్తతలకు ముందు ఈ జలసంధి గుండా రోజుకు 125 నుంచి 140 చమురు ట్యాంకర్లు ప్రయాణించగా, ప్రస్తుతం ఆ సంఖ్య సగటున 40కు పడిపోయినట్లు సమాచారం. తాజా దాడుల అనంతరం నౌకాయానం మరింత మందగించినట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రపంచ చమురు సరఫరాలో దాదాపు ఐదోవంతు హార్ముజ్ జలసంధి ద్వారానే జరుగుతోంది. దీంతో సరఫరాలో అంతరాయం ఏర్పడితే డీజిల్, పెట్రోలు వంటి





ఇంధనాల లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉందని అంతర్జాతీయ ఇంధన రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే ప్రపంచ మార్కెట్లో ముడి చమురు డిమాండ్ కొంత తగ్గడం, కొన్ని చమురు ఉత్పత్తి దేశాలు సరఫరాను పెంచేందుకు ముందుకు రావడంతో ధరలు అదుపు తప్పే పరిస్థితి ప్రస్తుతం కనిపించడం లేదు. తాజా పరిణామాల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 76 డాలర్లను దాటింది. ఈ వారంలోనే చమురు ధరలు సుమారు 4 నుంచి 5 శాతం వరకు పెరిగినట్లు మార్కెట్ విశ్లేషణలు సూచిస్తున్నాయి. ఇదిలా ఉండగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో చర్చలు కొనసాగించేందుకు అమెరికా సిద్ధంగా ఉందని వెల్లడించారు. అయితే ఇరు దేశాల మధ్య అమల్లో ఉన్న తాత్కాలిక కాల్పుల విరమణ ముగిసినట్లు ప్రకటించడంతో అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనలు మరింత పెరిగాయి. పరిస్థితులు మరింత ఉద్రిక్తమైతే ప్రపంచ ఇంధన మార్కెట్లపై దీని ప్రభావం అధికంగా ఉండే అవకాశముందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# అద్దె ఇంటి రుణంపై పన్ను మినహాయింపు

**న్యూఢిల్లీ, జులై 11 :** ఇంటిని రుణంతో కొనుగోలు చేసి అద్దెకు ఇచ్చిన వారికి కొత్త పన్ను విధానంలోనూ కీలక ప్రయోజనం కొనసాగుతోంది. అద్దెకు ఇచ్చిన ఇంటిపై చెల్లించే గృహ రుణ వడ్డీకి మినహాయింపు యథాతథంగా ఉన్నప్పటికీ, నష్టాలను ఇతర ఆదాయాలతో సర్దుబాటు చేసుకునే వెసులుబాటులో మాత్రం మార్పులు చోటుచేసుకున్నాయి. ఆదాయపు పన్ను చట్టంలోని నిబంధనల ప్రకారం అద్దెకు ఇచ్చిన ఇంటిపై చెల్లించే గృహ రుణ వడ్డీకి పాత, కొత్త పన్ను విధానాల్లోనూ మినహాయింపు లభిస్తుంది. అలాగే మున్సిపల్ పన్నులు, నికర వార్షిక విలువపై 30 శాతం ప్రామాణిక మినహాయింపును కూడా కొనసాగిస్తున్నారు. దీంతో అద్దె ద్వారా వచ్చే ఆదాయంపై పన్ను భారం కొంత వరకు తగ్గే అవకాశం ఉంటుంది. అయితే ప్రధాన మార్పు నష్టాల సర్దుబాటు విషయంలో ఉంది. ఒకవేళ గృహ రుణ వడ్డీ, ఇతర అనుమతించబడిన ఖర్చులు అద్దె ఆదాయం కంటే ఎక్కువగా ఉంటే నష్టం ఏర్పడుతుంది. పాత పన్ను విధానంలో ఈ నష్టాన్ని గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు జీతం లేదా ఇతర ఆదాయాలతో సర్దుబాటు చేసుకునే అవకాశం ఉండేది. దీనివల్ల పన్ను భారం తగ్గేది. కొత్త పన్ను విధానంలో మాత్రం ఈ వెసులుబాటును తొలగించారు. అద్దె ఇంటి వల్ల ఏర్పడిన నష్టాన్ని జీతం లేదా ఇతర ఆదాయాలతో సర్దుబాటు చేసుకునే అవకాశం లేదు. గృహ రుణ వడ్డీ మినహాయింపు అద్దె ఆదాయానికి మాత్రమే పరిమితం అవుతుంది. సొంతంగా నివసించే ఇంటిపై తీసుకున్న గృహ రుణానికి కూడా కొత్త పన్ను విధానంలో వడ్డీ మినహాయింపు ఉండదని నిపుణులు గుర్తుచేస్తున్నారు. అయితే అద్దెకు ఇచ్చిన ఇంటిపై మాత్రం వడ్డీ మినహాయింపు కొనసాగుతున్నప్పటికీ, నష్టాల సర్దుబాటుకు అవకాశం లేకపోవడం వల్ల పన్ను లెక్కల్లో తేడా ఏర్పడుతుంది. గృహ రుణ వడ్డీతో పాటు భవిష్య నిధి, ప్రజా భవిష్య నిధి, ఆరోగ్య బీమా, గృహ అద్దె భత్యం వంటి పలు



మినహాయింపులు ఎక్కువగా పొందేవారికి పాత పన్ను విధానం మరింత ప్రయోజనకరంగా ఉండే అవకాశం ఉందని పన్ను నిపుణులు సూచిస్తున్నారు. అందువల్ల ఆదాయపు పన్ను రిటర్ను దాఖలు చేసే ముందు రెండు విధానాల్లో పన్ను భారాన్ని లెక్కించి, తమకు అనుకూలమైన విధానాన్ని ఎంచుకోవాలని సూచిస్తున్నారు.




# పీఎఫ్ ఖాతాల్లో వడ్డీ జమ ప్రారంభం

**న్యూఢిల్లీ, జులై 11 :** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ తన సభ్యులకు శుభవార్త తెలిపింది. 2025--26 ఆర్థిక సంవత్సరానికి నిర్ణయించిన 8.25 శాతం వడ్డీని సభ్యుల భవిష్య నిధి ఖాతాల్లో జమ చేసే ప్రక్రియను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా కోట్లాది మంది సభ్యులు ఈ ప్రక్రియ ద్వారా లబ్ధి పొందనున్నారు. ఈపీఎఫ్‌ఓ వెల్లడించిన వివరాల ప్రకారం సుమారు 34 కోట్ల మంది సభ్యుల ఖాతాల్లో మొత్తం రూ.1.44 లక్షల కోట్లకు పైగా వడ్డీ జమ చేయనున్నారు. కొత్త కేంద్రీకృత సమాచార సాంకేతిక వ్యవస్థ ద్వారా ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. గతంలో వడ్డీ జమ ప్రక్రియ అక్టోబర్ లేదా నవంబర్ వరకు సాగేదని, ఈసారి ఆధునిక సాంకేతిక వ్యవస్థతో జులై నెలలోనే పూర్తి చేయడానికి చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఇప్పటికే అధిక శాతం ఖాతాల్లో వడ్డీ జమ పూర్తయిందని, మిగిలిన ఖాతాల్లో కూడా జులై 15 నాటికి మొత్తం ప్రక్రియ ముగిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. కొంతమంది సభ్యుల ఖాతాల్లో వడ్డీ వెంటనే కనిపించకపోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సాంకేతిక వ్యవస్థలో నవీకరణ పూర్తయిన తర్వాత వివరాలు అందుబాటులోకి వస్తాయని స్పష్టం చేశారు. వడ్డీ జమ అయిన తర్వాత సభ్యులు తమ భవిష్య నిధి ఖాతా నిల్వను అధికారిక వెబ్‌సైట్‌లో యూఏఎన్ సంఖ్యతో ప్రవేశించి పాస్‌బుక్ ద్వారా చూడవచ్చు. అలాగే మొబైల్ అనువర్తనం ద్వారా లేదా నమోదైన మొబైల్ నంబర్ నుంచి సందేశ సేవను ఉపయోగించి కూడా ఖాతా వివరాలను తెలుసుకునే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక సభ్యుల పాస్‌బుక్‌లలో తాజా నిల్వ మొత్తం ప్రతిబింబించనుంది.

# మహీంద్రా ఎస్‌యూవీ ధరలు పెంపు

**ముంబై, జులై 11 :** ప్రముఖ వాహన తయారీ సంస్థ మహీంద్రా తన ఎస్‌యూవీ శ్రేణి వాహనాల ధరలను మరోసారి పెంచింది. ముడిసరుకు ధరలు పెరగడం, ఉత్పత్తి వ్యయం అధికం కావడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ వెల్లడించింది. గరిష్ఠంగా 2.7 శాతం వరకు ధరలను సవరించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఒకసారి ధరలు పెంచిన మహీంద్రా, తాజాగా రెండోసారి ధరలను పెంచడం గమనార్హం. స్కార్పియో ఎన్ మినహా దాదాపు అన్ని పెట్రోల్, డీజిల్ ఎస్‌యూవీ మోడళ్లపై ఈ పెంపు వర్తిస్తుంది. తాజా సవరణలో బొలెరో వాహనంపై అత్యధికంగా రూ.49 వేల వరకు ధర పెరిగింది. అలాగే థార్ మూడు తలుపుల మోడల్, థార్ రాక్స్, ఎక్స్‌యూవీ 3ఎక్స్‌వో, బొలెరో నియో, స్కార్పియో క్లాసిక్, ఎక్స్‌యూవీ 7ఎక్స్‌వో మోడళ్ల ధరలు కూడా పెరిగాయి. అయితే స్కార్పియో ఎన్ ధరల్లో ఎలాంటి మార్పు చేయలేదు. తాజా ధరల ప్రకారం ఎక్స్‌యూవీ 3ఎక్స్‌వో ప్రారంభ ధర రూ.7.79 లక్షలుగా ఉండగా, థార్ రాక్స్ ధర రూ.12.52 లక్షల నుంచి ప్రారంభమవుతోంది. ఎక్స్‌యూవీ 7ఎక్స్‌వో ప్రారంభ ధర రూ.13.99 లక్షలుగా నిర్ణయించారు. విద్యుత్ వాహనాల విభాగంలో మాత్రం ఎక్స్‌ఈవీ 9ఎస్ ధరను మాత్రమే పెంచారు. ఈ మోడల్ ప్రారంభ ధర రూ.19.95 లక్షల నుంచి రూ.20.65 లక్షలకు చేరింది. అంటే ఒక్కసారిగా రూ.70 వేల మేర పెరిగింది. అయితే ఎక్స్‌యూవీ 3ఎక్స్‌వో విద్యుత్ మోడల్, బీఈ 6, ఎక్స్‌ఈవీ 9ఈ ధరల్లో ఎలాంటి మార్పు చేయలేదు. ఇటీవల పలు వాహన తయారీ సంస్థలు కూడా ఉత్పత్తి వ్యయం పెరగడాన్ని కారణంగా చూపుతూ ధరలను సవరించాయి. అదే బాటలో మహీంద్రా కూడా తాజా ధరల పెంపు నిర్ణయం తీసుకున్నట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.



# లార్డ్స్‌లో హర్మన్‌ప్రీత్ చరిత్ర..

## అరుదైన ఘనత సాధించిన భారత కెప్టెన్



లండన్, జులై 11 :
క్రికెట్ మక్కాగా పేరొందిన లార్డ్స్ మైదానంలో భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అరుదైన చరిత్ర సృష్టించింది. టెస్టు, వన్డే, టీ20 మూడు ఫార్మాట్లలోనూ లార్డ్స్‌లో అర్ధశతకం సాధించిన తొలి భారత క్రికెటర్‌గా ఆమె రికార్డు నెలకొల్పింది. అంతేకాకుండా ప్రపంచ క్రికెట్‌లో ఈ ఘనత సాధించిన తొలి మహిళా క్రికెటర్‌గా కూడా నిలిచింది. ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి మహిళల టెస్టు మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ ఈ ఘనతను అందుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టు ఆరంభంలోనే రెండు కీలక వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. 37 పరుగులకే షఫాలీ వర్మ, యాస్తికా భాటియా పెవిలియన్ చేరడంతో జట్టు ఒత్తిడిలో పడింది. ఈ దశలో స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్ జట్టును ఆదుకున్నారు. మూడో వికెట్‌కు 64 పరుగుల భాగస్వామ్యంతో ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టారు. ఆ తర్వాత స్మృతి మంధానతో కలిసి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 89 పరుగులు జోడించి జట్టు స్కోరును బలోపేతం చేశారు. హర్మన్‌ప్రీత్ ఎంతో ఓర్పుగా బ్యాటింగ్ చేస్తూ 121 బంతుల్లో 58 పరుగులు చేసి తన అర్ధశతకాన్ని పూర్తి చేసింది. అనంతరం అరంగేట్ర బౌలర్ మ్యాడీ విలియర్స్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయింది. ఇప్పటికే లార్డ్స్‌లో వన్డే, టీ20ల్లో అర్ధశతకాలు చేసిన హర్మన్‌ప్రీత్, ఇప్పుడు టెస్టులోనూ అదే ఘనత సాధించి ప్రత్యేక రికార్డును తన పేరిట లిఖించుకుంది. స్మృతి మంధాన 83 పరుగులతో జట్టుకు అద్భుత ఆరంభం అందించగా, జెమీమా రోడ్రిగ్స్ 35 పరుగులు చేసింది. అనంతరం లోయర్ ఆర్డర్‌లో దీప్తి శర్మ 57 పరుగులతో రాణించడంతో భారత జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 285 పరుగులకు ఆలౌటైంది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ నష్టానికి 21 పరుగులు చేసింది. ఇంకా భారత్ కంటే 264 పరుగులు వెనుకబడి ఉంది. లార్డ్స్ చరిత్రలో తొలి మహిళల టెస్టుకు ఆతిథ్యం లభించిన ఈ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సాధించిన అరుదైన ఘనత భారత క్రికెట్ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచింది.



## సెమీస్‌లోకి దూసుకెళ్లిన స్పెయిన్

**లాస్ ఏంజిల్స్, జులై 11:** ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీలో స్పెయిన్ జట్టు చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. ఉత్కంఠభరితంగా సాగిన క్వార్టర్ ఫైనల్ పోరులో బెల్జియంపై 2-1 గోల్స్ తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. 2010లో ప్రపంచకప్‌ను గెలిచిన తర్వాత స్పెయిన్ మళ్లీ సెమీస్‌కు చేరుకోవడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ విజయంతో డల్లాస్‌లో జరిగే సెమీఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ ఫ్రాన్స్‌తో స్పెయిన్ తలపడనుంది. మ్యాచ్‌లో స్పెయిన్ విజయంలో ప్రత్యామ్నాయ ఆటగాడు మైకెల్ మెరినో కీలక పాత్ర పోషించాడు. మ్యాచ్ చివరి దశలో మైదానంలోకి వచ్చిన ఆయన, ప్రత్యర్థి గోల్‌కీపర్ చేసిన చిన్న పొరపాటును సద్వినియోగం చేసుకుని 88వ నిమిషంలో విజయం ఖాయం చేసే గోల్ సాధించాడు. అంతకుముందు కూడా పోర్చుగల్‌తో జరిగిన నాకౌట్ మ్యాచ్‌లో మెరినో ప్రత్యామ్నాయ ఆటగాడిగానే బరిలోకి దిగి విజయ గోల్ నమోదు చేశాడు. ఆట ప్రారంభంలోనే స్పెయిన్ ఆధిపత్యం చాటింది. 30వ నిమిషంలో ఫాబియన్ రూయిజ్ గోల్ చేయడంతో స్పెయిన్‌కు ఆధిక్యం లభించింది. అయితే బెల్జియం కూడా వెంటనే ప్రతిస్పందించి 41వ నిమిషంలో చార్లెస్ డి కేటెలెర్ అద్భుత హెడర్‌తో గోల్ నమోదు చేసి స్కోరును సమం చేశాడు. ఈ గోల్‌తో స్పెయిన్ గోల్‌కీపర్ ఉనై సిమన్ కొనసాగిస్తున్న అద్భుత రికార్డు ముగిసింది. గత ఆరు మ్యాచ్‌లుగా ప్రత్యర్థి జట్టుకు ఒక్క గోల్ కూడా ఇవ్వని ఆయన అజేయ పరంపరకు బెల్జియం తెరదించింది. రెండో అర్ధభాగంలో బెల్జియానికి మరో ఎదురుదెబ్బ తగిలింది. ప్రధాన గోల్‌కీపర్ తిబౌట్ కోర్టోయిస్ గాయంతో మైదానం వీడాల్సి రావడం ఆ జట్టుపై ప్రభావం చూపింది. చివర్లో మెరినో గోల్‌తో స్పెయిన్ విజయం ఖరారైంది. ఈ విజయంతో స్పెయిన్ వరుసగా 36 మ్యాచ్‌ల్లో పరాజయం ఎరుగని జట్టుగా తన అద్భుత ప్రస్థానాన్ని కొనసాగించింది. ఇప్పుడు ఫ్రాన్స్‌తో జరిగే సెమీఫైనల్‌పై ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానుల దృష్టి నెలకొంది.

# రొనాల్డో పోస్ట్‌పై అభిమానుల ఆగ్రహం..

## సోషల్ మీడియాలో ట్రోలింగ్



లిస్బన్, జులై 11 :
ఫిఫా ప్రపంచకప్-2026 నుంచి పోర్చుగల్ జట్టు నిష్క్రమించిన కొద్ది రోజులకే ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో చేసిన ఒక సామాజిక మాధ్యమ పోస్టు తీవ్ర చర్చకు దారితీసింది. జట్టు ఓటమి బాధలో ఉన్న సమయంలో పదేళ్ల క్రితం సాధించిన యూరోపియన్ ఛాంపియన్‌షిప్ విజయాన్ని గుర్తు చేస్తూ పోస్టు చేయడంపై అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రొనాల్డోపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు, ట్రోలింగ్ వెల్లువెత్తుతున్నాయి. పోర్చుగల్ 2016లో యూరోపియన్ ఛాంపియన్‌షిప్ గెలిచి పదేళ్లు పూర్తయిన సందర్భంగా రొనాల్డో తన సామాజిక మాధ్యమ ఖాతాలో ఆ విజయాన్ని గుర్తు చేసుకుంటూ ప్రత్యేక పోస్టు చేశాడు. "లక్షలాది మంది విజయం" అనే సందేశంతో ఆనాటి విజయ క్షణాలను అభిమానులతో పంచుకున్నాడు. అయితే ప్రపంచకప్ నుంచి భావోద్వేగంగా నిష్క్రమించిన కొద్ది రోజులకే ఈ పోస్టు రావడంతో అభిమానులు సమయ ఎంపికపై అభ్యంతరం వ్యక్తం చేశారు. "ఇప్పుడు గత విజయాలను గుర్తు చేసుకునే సమయం కాదు", "గతంలోనే జీవిస్తున్నావు" అంటూ పలువురు విమర్శలు గుప్పించారు. ఇటీవల ప్రపంచకప్ నుంచి నిష్క్రమించిన అనంతరం రొనాల్డో మాట్లాడుతూ యూరోపియన్ ఛాంపియన్‌షిప్ తనకు ప్రపంచకప్‌తో సమానమైన ప్రాధాన్యం కలిగిన టైటిల్ అని పేర్కొన్నాడు. పోర్చుగల్ తరఫున తాను మూడు ప్రధాన టైటిళ్లు గెలిచానని, తన రాకముందు జట్టుకు ఒక్క ప్రధాన ట్రోఫీ కూడా లేదని గుర్తు చేశాడు. 2016లో గెలిచిన యూరోపియన్ ఛాంపియన్‌షిప్ పోర్చుగల్ ఫుట్‌బాల్ చరిత్రలో అత్యంత గొప్ప విజయాల్లో ఒకటిగా నిలిచిందని, అందుకే ఆ జ్ఞాపకాలను అభిమానులతో పంచుకున్నానని తెలిపాడు. పోర్చుగల్ తరఫున అత్యధిక మ్యాచ్‌లు ఆడి, అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా రొనాల్డో ఇప్పటికే ఎన్నో రికార్డులు నెలకొల్పాడు. అతని నాయకత్వంలో పోర్చుగల్ యూరోపియన్ ఛాంపియన్‌షిప్‌తో పాటు యూఈఎఫ్‌ఏ నేషన్స్ లీగ్ టైటిల్‌ను కూడా సొంతం చేసుకుంది. అయితే ఈసారి ప్రపంచకప్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన పోర్చుగల్ రౌండ్ ఆఫ్-16లో స్పెయిన్ చేతిలో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. తన చివరి ప్రపంచకప్‌లో ట్రోఫీ సాధించలేకపోయానన్న బాధతో రొనాల్డో భావోద్వేగానికి లోనయ్యాడు. అలాంటి సమయంలో ఆయన చేసిన తాజా పోస్టు అభిమానుల్లో భిన్నాభిప్రాయాలకు కారణమైంది.



## విరాట్ గోప్యతను గౌరవించాలి: జార్డన్ కాక్స్

లండన్, జులై 11 :
భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీ గోప్యతకు భంగం కలిగించిన ఘటనపై అతని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సహచరుడు జార్డన్ కాక్స్ ఆందోళన వ్యక్తం చేశాడు. ఇటీవల లండన్‌లో ఇద్దరూ కలిసి ఉన్న సమయంలో ఎవరో రహస్యంగా ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం విరాట్‌ను తీవ్రంగా బాధించిందని ఆయన వెల్లడించాడు. జార్డన్ కాక్స్ తెలిపిన వివరాల ప్రకారం, తాము కలిసి ఉన్న సమయంలో వందలాది మంది అక్కడి నుంచి వెళ్లినా ఎవరూ గుర్తించలేదు. అయితే కొంతసేపటి తర్వాత విరాట్ తనకు ఫోన్ చేసి, తమ ఇద్దరి ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయని చెప్పాడని తెలిపాడు. ఎవరో తెలియకుండా చిత్రీకరించి వాటిని ప్రచారం చేయడం సరైన పద్ధతి కాదని ఆయన అభిప్రాయపడ్డాడు. విరాట్ సాధారణ వ్యక్తిలా జీవించాలని కోరుకుంటాడని, కానీ అతని ప్రజాదరణ కారణంగా అది సాధ్యం కావడం లేదని కాక్స్ పేర్కొన్నాడు. ప్రముఖుల వ్యక్తిగత జీవితాన్ని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వారి గోప్యతకు భంగం కలిగించే చర్యలు చేయకూడదని సూచించాడు. ఈ ఘటనతో క్రీడాకారుల వ్యక్తిగత గోప్యత, భద్రత అంశాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. ప్రపంచవ్యాప్తంగా అభిమానులను కలిగిన విరాట్ కోహ్లీ వంటి క్రీడాకారులకు కూడా వ్యక్తిగత జీవితం ఉంటుందని, దానిని గౌరవించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, ఐపీఎల్ 2026 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయంలో విరాట్ కీలక పాత్ర పోషించాడని జార్డన్ కాక్స్ కొనియాడాడు. తన ఆటపై మాత్రమే కాకుండా సహచర ఆటగాళ్ల అభివృద్ధిపైనా విరాట్ దృష్టి పెడతాడని, తనకు కూడా విలువైన సూచనలు ఇచ్చి ఎంతో ప్రోత్సహించాడని వెల్లడించాడు. అతనిలో నాయకత్వ లక్షణాలు, జట్టును ముందుకు నడిపించే తత్వం ప్రత్యేకమని కాక్స్ ప్రశంసించాడు.

## క్రాంతి గౌడ్ ధాటికి ఇంగ్లండ్ కుదేలు

**లండన్, జులై 11:** చారిత్రాత్మక లార్డ్స్ మహిళల టెస్టులో భారత యువ పేసర్ క్రాంతి గౌడ్ అద్భుత బౌలింగ్‌తో ఇంగ్లండ్‌ను తీవ్ర ఒత్తిడిలోకి నెట్టింది. తొలి రోజే ప్రత్యర్థి ఓపెనర్ టమ్మీ బ్యూమంట్‌ను వికెట్ల ముందు దొరికేలా చేసి వెనక్కి పంపిన క్రాంతి.. రెండో రోజు కూడా అదే జోరును కొనసాగించింది. తొలి సెషన్‌లో వరుసగా రెండు కీలక వికెట్లు పడగొట్టి భారత జట్టుకు స్పష్టమైన పైచేయి అందించింది. మూడు వికెట్లు మాత్రమే తీసి ఆగకుండా అత్యంత కట్టుదిట్టంగా బంతులు వేస్తూ ఇంగ్లండ్ బ్యాటర్లను పరుగులు చేయనివ్వకుండా అద్భుత ప్రదర్శన కనబరిచింది. రెండో రోజు ఆట ప్రారంభమైన కొద్దిసేపటికే ఊహించని రీతిలో స్వింగ్ అవుతున్న బంతులతో ఇంగ్లండ్ బ్యాటర్లను క్రాంతి ఇబ్బంది పెట్టింది. ఓపెనర్ మియా బౌచిర్‌ను 23 పరుగుల వద్ద వెనక్కి పంపిన ఆమె.. ఆ వెంటనే అలిసే క్యాప్సేను అద్భుతమైన బంతితో క్లీన్‌బౌల్డ్ చేసింది. ఆ బంతికి ఆఫ్ స్టంప్ ఎగిరిపోవడంతో మైదానంలో ఉన్న భారత ఆటగాళ్లు సంబరాలు చేసుకున్నారు. అంతకుముందు మరో భారత పేసర్ సయాలీ సత్ఘరే బౌలింగ్‌లో హీథర్ నైట్ వికెట్ల ముందు దొరికిపోవడంతో ఇంగ్లండ్ జట్టు స్వల్ప వ్యవధిలోనే మూడు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. మొదటి రోజు భారత మహిళల జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 285 పరుగులు చేసి బలమైన స్థితిలో నిలిచింది. స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్ కౌర్, దీప్తి శర్మ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌లు ఆడి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించారు. అనంతరం బంతితో భారత పేసర్లు చెలరేగిపోవడంతో ఇంగ్లండ్‌కు ఆరంభం నుంచే ఎదురుదెబ్బలు తగిలాయి. కొత్త బంతిని సమర్థంగా వినియోగించిన భారత బౌలర్లు పరుగులను పూర్తిగా నియంత్రిస్తూ వికెట్ల వేట కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఇంగ్లండ్ తరఫున కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్, అమీ జోన్స్ క్రీజులో నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ భారత బౌలర్ల ధాటికి పరుగులు చేయడం కష్టంగా మారింది. ఇంగ్లండ్ ఇంకా భారత్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు చాలా దూరంలో ఉండటంతో మ్యాచ్‌పై భారత జట్టు పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. క్రాంతి గౌడ్ స్వింగ్, కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేయడం ఈ మ్యాచ్‌లో భారత విజయావకాశాలను మరింత బలపరిచిందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## వింబుల్డన్‌లో సందడి చేసిన శుభ్‌మన్ గిల్

### సచిన్‌తో కలిసి మ్యాచ్ వీక్షణ



లండన్, జులై 11 :
భారత టెస్టు, వన్డే జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. లండన్‌లోని చారిత్రక సెంటర్ కోర్టులో ఉన్న రాయల్ బాక్స్‌కు ప్రత్యేక ఆహ్వానం అందుకున్న గిల్.. భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, ఆయన సతీమణి అంజలితో కలిసి మ్యాచ్‌ను వీక్షించాడు. వీరు ముగ్గురూ కలిసి కూర్చున్న చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. వింబుల్డన్ రాయల్ బాక్స్‌కు ఆహ్వానం అందుకున్న నాలుగో భారత క్రికెట్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ అరుదైన గౌరవాన్ని అందుకున్నాడు. ఇంతకుముందు సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలకు మాత్రమే ఈ గౌరవం లభించింది. 2013లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సచిన్‌ను వింబుల్డన్ నిర్వాహకులు 'క్రికెట్ రాయల్టీ'గా అభివర్ణించడం విశేషం. వెస్టిండీస్ దిగ్గజం బ్రియాన్ లారా కూడా రాయల్ బాక్స్‌లో ప్రత్యేక అతిథిగా కనిపించాడు. ఇటీవల శుభ్‌మన్ గిల్ మరో అంతర్జాతీయ క్రీడా వేదికలోనూ సందడి చేశాడు. బ్రిటిష్ గ్రాండ్ ప్రిక్స్ సందర్భంగా సిల్వర్‌స్టోన్ సర్క్యూట్‌లో జరిగిన ఫార్ములా1 రేసును ప్రత్యేక అతిథిగా వీక్షించాడు. ప్యాడక్‌ను సందర్శించి పలువురు ప్రముఖ డ్రైవర్లు, బృంద సభ్యులతో ముచ్చటిస్తూ రేసింగ్ వాతావరణాన్ని ఆస్వాదించాడు. మరోవైపు సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్‌తో శుభ్‌మన్ గిల్ సన్నిహితంగా ఉన్నారనే ప్రచారం గత కొన్నేళ్లుగా సామాజిక మాధ్యమాల్లో వినిపిస్తోంది. అయితే ఈ విషయంపై గిల్ గానీ, సారా గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక వ్యాఖ్యలు చేయలేదు. అయినప్పటికీ వింబుల్డన్‌లో సచిన్ పక్కనే గిల్ కనిపించడంతో కొందరు నెటిజన్లు మరోసారి ఆ ప్రచారాన్ని ప్రస్తావిస్తూ వివిధ వ్యాఖ్యలు చేస్తున్నారు. అయితే ఈ ప్రచారాలకు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ధృవీకరణ లేదు.

## తెలుగులో మాట్లాడి ఆకట్టుకున్న మంధాన

లండన్, జులై 11 :
భారత మహిళల క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన మరోసారి అభిమానుల మనసు గెలుచుకుంది. ఇంగ్లండ్‌తో జరుగుతున్న చారిత్రాత్మక మహిళల టెస్టు మ్యాచ్‌కు ముందు తెలుగు క్రికెటర్ శ్రీచరణికి టెస్టు క్యాప్ అందజేస్తూ తెలుగులో మాట్లాడి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ముద్దుగా తెలుగు పదాలు పలుకుతూ శ్రీచరణికి శుభాకాంక్షలు తెలిపిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతోంది. లార్డ్స్ మైదానంలో టెస్టు అరంగేట్రం చేస్తున్న శ్రీచరణికి జట్టు సమావేశంలో టెస్టు క్యాప్ అందజేసిన సందర్భంగా మంధాన ప్రత్యేకంగా ప్రసంగించింది. తన కెరీర్‌లో అత్యుత్తమ స్పిన్నర్‌గా ఎదగాలని ఆకాంక్షిస్తూ, ముందుగా సిద్ధం చేసుకున్న తెలుగు పదాలను చదువుతూ "నువ్వే అందరికన్నా బెస్ట్" అని చెప్పి శ్రీచరణిని అభినందించింది. మంధాన తెలుగు మాట్లాడిన తీరు జట్టు సభ్యులతో పాటు అభిమానులను కూడా ఆకట్టుకుంది. ఒకే ప్రపంచకప్ టోర్నీలో అత్యధిక వికెట్లు సాధించిన భారత మహిళా బౌలర్‌గా కొత్త రికార్డు నెలకొల్పింది. అంతకుముందు పూనమ్ యాదవ్ పేరిట ఉన్న రికార్డును అధిగమించి, ప్రపంచ స్థాయిలో కూడా అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్ల జాబితాలో అగ్రస్థానాల్లో నిలిచింది.





# ఓ సుకుమారి ట్రైలర్ విడుదల

'మసూద', 'పరేషాన్' చిత్రాలతో వైవిధ్యమైన నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న తిరువీర్, టాలెంటెడ్ బ్యూటీ ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటించిన లేటెస్ట్ మూవీ 'ఓ సుకుమారి'. భరత్ దర్శన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఫీల్ గుడ్ మ్యూజికల్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అధికారిక ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఒక అందమైన గ్రామీణ నేపథ్యంలో సాగే స్వచ్ఛమైన ప్రేమకథ, ఆ తర్వాత వారి జీవితాల్లో వచ్చే మలుపుల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. తిరువీర్ తన మార్క్ సహజ నటనతో ఆకట్టుకోగా, ఐశ్వర్య రాజేష్ మరోసారి నటన ప్రాధాన్యమున్న పాత్రలో మెరిశారు. భరత్ మంచిరాజు అందించిన స్వరాలు, నేపథ్య సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. సున్నితమైన భావోద్వేగాలు, చక్కటి వినోదంతో కూడిన ఈ చిత్రం జూలై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## మురుగన్ నేపథ్యంలో చిత్రాల నిర్మాణం

### తెలుగు, తమిళంలో కార్తికేయుడి నేపథ్యంలో సినిమాలు

దక్షిణాది సినీ పరిశ్రమలో దైవిక, పురాణ గాథల నేపథ్యానికి నయా క్రేజ్ మొదలైంది. ఒకప్పుడు పౌరాణిక కథలకు కేరాఫ్ అడ్రస్‌గా కోలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీలు మళ్లీ అదే బాట పట్టినట్లు తెలుస్తున్నాయి. ప్రస్తుతం తమిళ, తెలుగు సినీ రంగాలలో లార్డ్ మురుగన్ (సుబ్రమణ్య స్వామి) కాన్సెప్ట్ ఒకవైపు భారీ ట్రెండ్‌గా మారుతోంది. టాలీవుడ్, కోలీవుడ్ ప్రముఖ దర్శకులు, అగ్ర హీరోలు మురుగన్ బ్యాక్‌డ్రాప్‌లో ప్రతిష్టాత్మక చిత్రాలను ప్రకటించడం సోషల్ మీడియా వ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ఈ ట్రెండ్‌ను మొదటిగా కోలీవుడ్ హీరో శివకార్తికేయన్ ప్రారంభించాడు అని చెప్పవచ్చు. శివకార్తికేయన్ పుట్టినరోజు పురస్కరించుకుని విడుదలైన ఒక గ్లింప్స్ ఇటీవలే అందరి దృష్టిని ఆకర్షించింది. శివకార్తికేయన్ ప్రధాన పాత్రలో లోకనాయకుడు కమల్ హాసన్ భారీ నిర్మాణంలో, శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'సేయోన్' అనే చిత్రం ఈ మురుగన్ సెంటిమెంట్‌కు పునాది వేసింది. తమిళ ప్రాచీన సంస్కృతి, సాహిత్యంలో కార్తికేయుడిని 'సేయోన్' అని పిలుస్తారు. ఈ చిత్ర గ్లింప్స్‌లో శివకార్తికేయన్ విరుమాండి స్వామి పూనకం వచ్చినట్లుగా, అత్యంత ఊరమాస్ లుక్‌లో పల్లెటూరి జాతర నేపథ్యంలో కనిపించి అభిమానులను అలరించారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్న ఈ యాక్షన్ డ్రామాను అక్టోబర్ లో గ్రాండ్‌గా విడుదల చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ మరియు మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఒక భారీ పాన్–ఇండియా ప్రాజెక్ట్ అనౌన్స్ అయింది. ఈ చిత్రానికి 'గాడ్ ఆఫ్ వార్' అనే టైటిల్ విస్తృతంగా ప్రచారంలో ఉంది. దీంతో ఈ ప్రాజెక్ట్ కూడా మురుగన్ జీవితంపై రాబోతుండడంతో టాలీవుడ్ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరోవైపు ఈ సినిమా ప్రకటన సమయంలో నిర్మాత నాగవంశీ సోషల్ మీడియాలో పెట్టిన ఒక పోస్ట్ తీవ్ర వివాదానికి దారితీసింది. మురుగన్ స్వామి 'ఉత్తరాదిన జన్మించాడు.. దక్షిణాదిన పూజించబడుతున్నాడు' అంటూ ఆయన పేర్కొన్న వ్యాఖ్యలపై తమిళనాడులో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తమిళులు తమ ప్రాచీన దేవుడైన 'తమిళ్ కడవుల్' (తమిళ దేవుడు) మురుగన్‌ను ఉత్తరాది మూలాలతో ముడిపెట్టడంపై తీవ్రంగా మండిపడ్డారు. ఎన్టీఆర్ సినిమాపై ఈ రకమైన రాజకీయ, ప్రాంతీయ దుమారం రేగుతున్న తరుణంలోనే, ధనుష్ మరియు వెట్రిమారన్ కాంబినేషన్‌లో 'తమిళ్ మురుగన్' ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తూ ఫస్ట్ లుక్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. పీరియడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్ర ఫస్ట్ లుక్‌లో ధనుష్ ఒక భారీ ఏనుగుపై గంభీరంగా కూర్చొని, చేతిలో మురుగన్ స్వామి యొక్క శక్తివంతమైన ఆయుధం 'వేల్' (ఈటె) పట్టుకుని, ఒక భారీ సైన్యం ముందు తమిళ ప్రజలకు, ఆ నేలకూ రక్షకుడిగా కనిపించారు. అయితే ఒకప్పుడు భక్తిరస చిత్రాలుగా వచ్చిన దేవుళ్ల కథలు, ఇప్పుడు సౌత్ ఇండస్ట్రీలో భారీ బడ్జెట్ యాక్షన్ డ్రామాలుగా, అలాగే ప్రాంతీయ అస్తిత్వానికి ప్రతీకలుగా మారుతున్నాయి.




# అఖిల్‌కు హిట్ ఇమ్మని శ్రీవారిని కోరుకున్నా

### లెనిన్ సక్సెస్ మీట్‌లో నాగార్జున







తిరుమల శ్రీవారి దర్శనానికి ఎప్పుడెళ్లినా తాను ఏం కోరుకోనని.. కానీ, ఇటీవల వెళ్లినప్పుడు మాత్రం అఖిల్‌కు మంచి హిట్ ఇవ్వమని కోరుకున్నట్లు నాగార్జున తెలిపారు. అఖిల్ హీరోగా మురళీ కిషోర్ అబ్బూరి తెరకెక్కించిన 'లెనిన్' తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో నాగార్జున మాట్లాడుతూ.. అఖిల్‌కు విజయాన్ని ఇవ్వాలనే ఏకైక లక్ష్యంతో టీమ్ అంతా కలిసి కట్టుగా వర్క్ చేసిందన్నారు. సినిమాకు అడగ్గానే వాయిస్ ఓవర్ ఇచ్చిన మా పెద్దబ్బాయ్ తారక్‌కు ధన్యవాదాలు. సరిగ్గా ఏడాది క్రితం 'తండేల్' సక్సెస్‌మీట్‌కు వచ్చాను. ఇప్పుడు 'లెనిన్' ఈవెంట్.. నాగచైతన్య, అఖిల్ ఇద్దరూ నాకు రెండు కళ్లు. 'లెనిన్' దర్శకుడు మురళీ కిషోర్, ఎడిటర్ నవీన్ ఇద్దరూ పనిరాక్షసులు. భాగ్యశ్రీ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. ఈ చిత్రాన్ని అంగీకరించినందుకు ఆ అమ్మాయికి థాంక్స్ చెప్పాలి. సినిమా విడుదలకు ముందు రోజు రాత్రి భాగ్యశ్రీ ఫోన్ చేసి టెన్షన్ పడింది. తాను ఎంతో కష్టపడుతున్నాననీ కానీ, సరైన గుర్తింపు రావట్లేదని బాధపడింది. 'కష్టానికి తగిన ప్రతిఫలం కచ్చితంగా వస్తుందని చెప్పా. అదే నిజమైంది. ఈ సినిమా విజయంలో నాగవంశీ ముఖ్యపాత్ర పోషించారని టీమ్‌కు థాంక్స్ చెప్పారు. ఇక అఖిల్ గురించి మాట్లాడుతూ.. ఏది అనుకున్నా దాన్ని కచ్చితంగా సాధించాలనే తపన చిన్నప్పటి నుంచి ఉంది. ఎంతో ఎనర్జిటిక్‌గా ఉంటాడు. ఇప్పటి వరకూ ప్రతి సినిమాకు వందశాతం న్యాయం చేశాడు. కానీ, హిట్ కొట్టలేకపోయాడు. 'లెనిన్'తో సరైన హిట్ పడింది. ఈ సినిమాకు ముందు ఒక ప్రమాదంలో అఖిల్ చేతికి దెబ్బతగిలింది. చాలా రోజులు చేయి పనిచేయలేదు. మళ్లీ మాములుగా వస్తుందా లేదా అని అందరం టెన్షన్ పడ్డాం. ఆ సమయంలో అఖిల్‌లో చాలా మార్పు వచ్చింది. దేని గురించైనా నిదానంగా ఆలోచించడం నేర్చుకున్నాడు. అదే సమయంలో పెళ్లి అయింది. వాడికంటూ ఓ తోడు వచ్చింది. గుడ్ టైం ప్రారంభమైందనిపించిందని చెప్పారు. అక్కినేని అభిమానులకు నాగార్జున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# భాగ్యశ్రీ బోర్సే .. భావోద్వేగం



'లెనిన్'లో అఖిల్‌కు జోడీగా భారతి పాత్రలో నటించి ఆకట్టుకున్నారు నటి భాగ్యశ్రీ బోర్సే. ఈ సినిమా కోసం టీమ్ ఎంతో కష్టపడిందని ఆమె తెలిపారు. తాజాగా ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో భాగ్యశ్రీ మాట్లాడుతూ.. తన అభిమానులు తనను నిరంతరం ప్రోత్సహిస్తూనే ఉన్నారని ఈ చిత్రబృందంతో పాటు వాళ్లందరి వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. హైదరాబాద్ తనకు కర్మభూమి అని చెప్పారు.


## తండ్రిని హత్తుకున్న అఖిల్

అఖిల్ మూవీ హిట్ అయితే చూడాలని ఆశగా ఎదురుచూసిన అక్కినేని అభిమానుల కల నెరవేరింది. ఆయన కథానాయకుడిగా మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో రూపొందిన రూరల్ యాక్షన్ డ్రామా 'లెనిన్'. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. ముఖ్యంగా అఖిల్ నటన, ద్వితీయార్ధంలో వచ్చే ట్విస్ట్‌లు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. ఈ సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్ సక్సెస్ సెలబ్రేషన్స్ జరిగాయి. చిత్ర బృందం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంది. ఈ సందర్భంగా తండ్రి నాగార్జున పాదాలకు నమస్కరించిన అఖిల్.. ఆయన్ను గట్టిగా హత్తుకుని భావోద్వేగానికి గురయ్యారు.



# 24న రామాయణ ట్రైలర్ విడుదల

భారతీయ చిత్ర పరిశ్రమ చరిత్రలోనే భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ'. విడుదలకు ముందే ఈ సినిమాపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో ఇదీ ఒకటి. ఈ మూవీలో రాముడిగా బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి నటిస్తున్నారు. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. తాజాగా చిత్రబృందం ఈ సినిమా ట్రైలర్ విడుదల తేదీని ప్రకటించింది. జులై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు ఇన్‌స్టా వేదికగా వెల్లడించింది. కొన్ని వేల సంవత్సరాలుగా ధర్మం, మర్యాద, ధైర్యం, కరుణ అనే ఆదర్శాలతో 'రామాయణం' ఎన్నో తరాలకు స్ఫూర్తినిచ్చింది. మన నాగరికతకు అద్దం పట్టే ఈ గొప్ప ఇతిహాసాన్ని ప్రపంచానికి సరికొత్తగా పరిచయం చేయ–ంబోతున్నాం అని ఇన్‌స్టాలో చిత్రబృందం పోస్ట్ చేసింది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవితో పాటు పలువురు అగ్ర తారలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో ఈ సినిమా తీస్తున్నట్లు నిర్మాత నమిత్ మల్హోత్రా తెలిపారు.




Printed, Published and Owned by MOHAMMAD ABDUL RAHEMAN, and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273 Email: udyamakeratam@gmail.com. Phone No: 9030717172, 9391127717